Follow: @ANNTELUGU
ANN తెలుగు
13-09-2025
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 280 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# రాసిపెట్టుకోండి
## 2029లో మళ్ళీ మోదీనే..
### నాలుగోసారి ప్రధాని కావడం ఖాయం
### నాలెడ్జి ఎకానమీగా అమరావతి:చంద్రబాబు

**అమరావతి, మహా :** దేశంలో, రాష్ట్రంలో 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమే అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. కావాలంటే రాసిపెట్టుకోండని, 2029లో నరేంద్ర మోడీ నాలుగోసారి పీఎం అవుతారని అన్నారు. విజయవాడలో జరిగిన వేటున్యూస్ మీడియా కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడారు. ఆలస్యంగా సాధించే విజన్ 2020, 2047 వల్ల రాజకీయంగా నష్టమేమీ ఉండదన్నారు. 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి నంబర్‌వన ఎకానమీగా అవతరించాలని ఆకాంక్షించారు.

మిగతా 3లో

టాప్ న్యూస్

నేపాల్ కొత్త ప్రధానిగా మాజీ చీఫ్
## జస్టిస్ సుశీల కార్కీ
- దేశాధ్యక్షుడు ఇందుకు ఆమోదం తెలపడంతో.. పార్లమెంట్ రద్దు
- తాత్కాలిక ప్రధానిగా సుశీల కార్కీ ప్రమాణస్వీకారం



02

కవిత ఆరోపణలపై ఎందుకు స్పందించడం
## లేదు?
- కేటీఆర్‌కు మంత్రి జూపల్లి కౌంటర్



03

## కంగనా రనౌత్‌కు చుక్కెదురు
- పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



02

# గోదావరి పుష్కరాలకు ముందస్తు వ్యూహం
## దక్షిణ కుంభమేళాకు ఆర్థిక ప్యాకేజీ సాధన కోసం సీఎం వ్యూహం
22 నెలల ముందే పుష్కరఘాట్లు.. శాశ్వత అభివృద్ధి పనులపై ఫోకస్
బాసర టు భద్రాద్రిపై కార్యాచరణ... అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



**హైదరాబాద్, మహా :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణను ప్రారంభించింది. ఈ పుష్కరాలను 'దక్షిణ కుంభమేళా'గా పరిగణించి, భారీ ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కోరాలని నిర్ణయించింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. పుష్కరాలు ప్రారంభం కావడానికి ఇంకా 22 నెలల సమయం ఉన్నప్పటికీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో




# ఖనిజాల తవ్వకాల్లోనూ సింగరేణి
సింగరేణి బోర్డు కీలక నిర్ణయం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, మహా :** సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లోనూ పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతోపాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



మిగతా 2లో

## సింగరేణి ఎన్నికల్లో గెలవబోయేది మనమే
- అవినీతిపై సీబీఐకి కంప్లైంట్ చేస్తాం
- కల్వకుంట్ల కవిత

02



# గోదావరి పుష్కరాలకు ముందస్తు వ్యూహం




(మొదటిపేజీ తరువాయి)

కేవలం తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టకుండా, భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో గోదావరి నది ప్రవహించే బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, అందువల్ల ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. రోజుకు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చినా తట్టుకునేలా రోడ్లు, పార్కింగ్, తాగునీరు, స్నానఘట్టాలు, వసతి వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

**రాష్ట్రంలో 74 ఘాట్లు**

రాష్ట్రంలో గోదావరి నది సుమారు 560 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండగా, 74 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. ప్రతి ప్రధాన ఆలయం, ఘాట్ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానిక అధికారులు, ఆలయ కమిటీలతో చర్చించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో కుంభమేళా, పుష్కరాల నిర్వహణలో అనుభవం ఉన్న కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు. ఈ భారీ ఏర్పాట్ల కోసం స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి కూడా నిధులు సమీకరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పర్యాటక, నీటిపారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ఎన్నికల్లో గెలవబోయేది మనమే

## అవినీతిపై సీబీఐకి కంప్లైంట్ చేస్తాం : కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్, మహా :** సింగరేణి ఎన్నికల్లో గెలవబోయేది మనమేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై సీబీఐకి కంప్లైంట్ చేస్తామని ఆమె తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ - సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం (ఏబీ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం) జరిగింది. హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నికైన కల్వకుంట్ల కవిత ఈ సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని కవిత ఆరోపించారు. రాబోయే సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్ జెండా ఎగురబోతోందని ఆమె జోస్యం చెప్పారు. అవినీతిని కట్టడి చేయకుంటే సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని కవిత హెచ్చరించారు. 'కాంగ్రెస్ అంటేనే కరెప్షన్ పార్టీ... సింగరేణిలో తీవ్రమైన అవినీతికి పాల్పడుతున్నారు. ప్రతి కాంట్రాక్ట్ లో 25 శాతం అవినీతి జరుగుతోంది. 10 శాతం వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోంది. ప్రభుత్వం స్పందించకుంటే మేమే సీబీఐకి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. కార్మికుల బాగు కోసం పనిచేస్తానని హామీ ఇస్తున్నాను. ' అని కవిత అన్నారు. టీబీజీకేఎస్ అనేది మొన్న ఎన్నికల్లో పోటీనే చేయలేదని చెప్పిన కవిత.. గుర్తింపు సంఘం అనుకుంటున్న వాళ్లు.. వాపును చూసి బలుపు అనుకుంటున్నారని విమర్శించారు. ' నిజానికి సింగరేణి ఎన్నికల్లో వాళ్లకు గెలిచేంత సీన్ లేదు. సింగరేణిలో ఇప్పుడున్న ఎర్రజెండా కాకుండా మరొక జెండా ముందుకు రాబోతోంది. హెచ్ఎంఎస్, జాగృతి సంస్థలు మొత్తం 40వేల మంది సింగరేణి కార్మికుల కోసం పనిచేస్తాయి. గతంలో కేసీఆర్ గారు చెప్పారనే టీబీజీకేఎస్ కు ఓటు వేశారు. కేసీఆర్ గారు ఇప్పుడు అధికారంలో లేరు. సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పుడున్న టీబీజీకేఎస్ నాయకులు ఎందుకు పోరాటం చేయటం లేదో కార్మికులకు సమాధానం చెప్పాలి. ప్రతిక్షణం కార్మికుల కోసం ఫీల్డ్ లో ఉండి పనిచేసే వారే కార్మిక సంఘం గెలుస్తారు. టీబీజీకేఎస్ నాయకులు అవినీతి చేయొద్దని గతంలో నేను ఎన్నోసార్లు చెప్పాను. అయినా నాయకులు స్వార్థంతో అవినీతి చేశారు. కార్మిక సంఘాల్లో యువతను ప్రోత్సహించాలని కోరినా పట్టించుకోలేదు. సింగరేణి కార్మికులకు పైసా ఖర్చు లేకుండా వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. దీని మీద టీబీజీఎస్ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు?' అని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు.




# ఖనిజాల తవ్వకాల్లోనూ సింగరేణి

(మొదటిపేజీ తరువాయి)

రాయచూరు, దేవదుర్గ ప్రాంతాల్లో కాపర్ అండ్ గోల్డ్ మైనింగ్ యాక్షన్‌లో సింగరేణి పాల్గొందని గుర్తు చేశారు. దాని వల్ల సింగరేణి 37.75శాతం వాటాను దక్కించుకుందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

# నేపాల్ కొత్త ప్రధానిగా మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కార్కీ

## దేశాధ్యక్షుడు ఇందుకు ఆమోదం తెలపడంతో.. పార్లమెంట్ రద్దు

## తాత్కాలిక ప్రధానిగా సుశీల కార్కీ ప్రమాణస్వీకారం



**ఖాట్మండ్ :** నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీల్ కార్కీ బాధ్యతలు చేపట్టేందుకు దాదాపు మార్గం సుగమం అయ్యింది. సుశీల్ కార్కీకి ప్రధానిగా బాధ్యతలు అప్పగించాలని జెనరేషన్ జెడ్ నిరసనకారుల ఆందోళనకు మద్దతుగా ఆ దేశ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడేల్, ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్దేల్‌లు అంగీకరించారు. ఈ క్రమంలోనే పార్లమెంట్‌ను సైతం రద్దు చేశారు. ఈ నేపథ్యంలో సుశీల్ కర్కీ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడం ఖరారైంది. ఆమె ప్రమాణస్వీకార కార్యక్రమం కూడా సాధ్యమైనంత తొందరగానే ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ఎవరు సుశీలా కార్కీ..**

సుశీలా కార్కీ 2016 జూలై నుంచి 2017 జూన్ వరకు నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. నేపాల్ చరిత్రలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి చేపట్టిన తొలి మహిళ. 1970లలో న్యాయవాదిగా తన కెరీర్ ప్రారంభించిన ఆమె.. 2009లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2010లో శాశ్వత న్యాయమూర్తిగా ప్రమోషన్ పొందారు. తాజాగా, నేపాల్‌లో నెలకొన్న అంతర్యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుశీలా కార్కీ తన పదవీకాలంలో అవినీతిపై పోరాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆమె ఇచ్చిన ముఖ్యమైన తీర్పుల్లో.. మహిళలు తమ పిల్లలకు పౌరసత్వ హక్కులు ఇవ్వగలగడం. ఇది నేపాల్‌లో లింగ సమానత్వం దిశగా కీలక అడుగులు పడేలా చేసింది. ఈ తీర్పుతో సుశీలా కార్కీపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం కూడా వచ్చినప్పటికీ..ప్రజా వ్యతిరేకతతో అది వెనక్కి తీసుకున్నారు. నేపాల్‌లో రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్న సమయంలో ఆ దేశ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి అయిన సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా నియమిస్తే బాగుంటుందని జెన్‌జీ భావించింది.

**కేపీ శర్మ ఓలీ రాజీనామా..**

ఆ దేశంలో హింసాత్మక నిరసనలు, తీవ్రమవుతున్న రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. సైన్యం సూచనతో రాజీనామా చేస్తున్నట్లు కేపీ శర్మ ఓలీ ప్రకటించారు. ఆయన నేపాల్ నుంచే దుబాయ్ వెళ్లే అవకాశం ఉంది. దీంతో సైన్యం కొత్త ప్రధాని పేరును ప్రకటించే అవకాశం ఉంది. సోమవారం ప్రారంభమైన హింసాత్మక ప్రదర్శనల్లో 20 మందికి పైగా మరణించగా.. వందలాది మంది గాయపడ్డారు. ఈ ఘటనలతో ప్రభుత్వం పూర్తిగా ఇరుకున పడింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి సైన్యాన్ని మోహరించినప్పటికీ.. జెంజీ యువతరం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలు ఓలీ ప్రభుత్వాన్ని రాజీనామా చేసేలా చేశాయి.

# కవిత ఇంటికి కేసీఆర్ సతీమణి

- అల్లుడు అనిల్ పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న శోభమ్మ
- కొద్ది రోజుల క్రితం మనవడి బర్త్‌డేకు దూరంగా ఉన్న శోభ
- కల్వకుంట్ల కుటుంబ విభేదాల నేపథ్యంలో ఆసక్తిగా మారిన భేటీ



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌కు గురైన తర్వాత కల్వకుంట్ల కుటుంబంలో చోటు చేసుకున్న పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. తీవ్ర విభేదాలు నెలకొన్నాయన్న ప్రచారం నడుమ, కవిత తల్లి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ ఆమె నివాసానికి వెళ్లడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కవిత భర్త అనిల్ కుమార్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె వెళ్లారు. ఈ సందర్భంగా కుమార్తె కవితతో శోభ ప్రత్యేకంగా మాట్లాడినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని రోజుల పాటు నిదానంగా వ్యవహరించాలని, కాలక్రమేణా అన్నీ సర్దుకుంటాయని కుమార్తెకు ఆమె ధైర్యం చెప్పినట్లు సమాచారం. పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన తర్వాత ఒంటరయ్యారన్న భావనలో ఉన్న కవితకు తల్లి రాక ఊరటనిచ్చిందని తెలుస్తోంది. అయితే, కొద్ది రోజుల క్రితం జరిగిన కవిత కుమారుడి పుట్టినరోజు వేడుకకు శోభ హాజరుకాకపోవడం గమనార్హం. ఈ నెల 2న కవితపై పార్టీ వేటు వేయగా, 5వ తేదీన మనవడి పుట్టినరోజు కార్యక్రమం జరిగింది. ఆ వేడుకకు రావాల్సిందిగా కవిత ఆహ్వానించినా, శోభ దూరంగా ఉన్నారు. అయితే, మనవడి కోసం కొత్త బట్టలు, పూజా సామగ్రిని మాత్రం పంపినట్లు సమాచారం. మనవడి కార్యక్రమానికి దూరంగా ఉండి, అల్లుడి పుట్టినరోజుకు హాజరుకావడం వెనుక కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. సొంత పార్టీ నేతలైన హరీశ్‌రావు, సంతోశ్ కుమార్‌లపై కవిత తీవ్ర అవినీతి ఆరోపణలు చేయడం, వారి వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తోందని వ్యాఖ్యానించడం పార్టీలో పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమశిక్షణా రాహిత్యం కారణంగానే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో తల్లి శోభ ఆమెను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.



# కంగనా రనౌత్‌కు చుక్కెదురు

## పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**మహా:** బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు సర్వోన్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన పరువు నష్టం కేసును రద్దు చేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ సందర్భంగా కంగనా తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "మీరు చేసింది కేవలం రీట్వీట్ మాత్రమే కాదు, దానికి మసాలా కూడా జోడించారు" అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మోహతాలతో కూడిన ధర్మాసనం ఘాటుగా స్పందించింది. కంగనా అభ్యర్థనను తోసిపుచ్చుతున్నట్లు స్పష్టం చేసింది.

# అమెరికాలో దారుణం

## భారతీయుడి తల నరికిన అక్రమ వలసదారు

## భార్యా పిల్లల ముందే ఘాతుకం

**మహా :** అమెరికాలోని డల్లాస్ కౌంటీలోని శామ్యూల్ బౌలేవార్డ్‌లోని డౌన్‌టౌన్ సూట్స్ మోటెల్‌లో చంద్ర మౌళి నాగమల్లయ్య అనే భారతీయుడ్ని క్యూబాకు చెందిన అక్రమ వలసదారు దారుణంగా హత్య చేశాడు. అతని పేరు యోర్డానిస్ కోబోస్‌మార్టినెజ్. నాగమల్లయ్య మోటెల్ మేనేజర్ గా పని చేస్తున్నారు. హంతకుడు మోటెల్‌లో ఓ వాషింగ్ మెషిన్ ను వాడుకునే ప్రయత్నం చేసినప్పుడు మహిళా ఉద్యోగి ఆ వాషింగ్ మెషిన్ పని చేయడం లేదని చెప్పడంతో అతను దురుసుగా ప్రవర్తించాడు. దాంతో మేనేజర్ గా ఉన్న నాగమల్లయ్య సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే హంతకుడు చాలా నేరమనస్థత్వం ఉన్నవాడు కావడంతో గొడవను అంతకంతకూ పెంచుకుంటూ పోయాడు. గొడవ జరుగుతున్న సంగతి తెలిసి అక్కడే ఉంటున్న నాగమల్లయ్య భార్య, పిల్లలు కూడా వచ్చారు. వారి ముందే మార్టినెజ్ కత్తి తీసుకొని నాగమల్లయ్యపై దాడి చేసి, మోటెల్ ఫ్రంట్ ఆఫీస్ వరకు వెంబడించాడు. నాగమల్లయ్య భార్య , కుమారుడు ఆపడానికి ప్రయత్నించినప్పటికీ నాగమల్లయ్య తలను నరికి, ఆ తలను పార్కింగ్ లాట్‌లో విసిరేశాడు. తర్వాత చెత్తబుట్టలో పడేశాడు ఇదంతా వీడియో కెమెరాల్లో రికార్డు అయింది. హంతకుడు కోబోస్‌మార్టినెజ్‌ను పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. రక్తంతో నిండిన దుస్తులు , కత్తి, నాగమల్లయ్య సెల్ ఫోన్, కీ కార్డ్ ను అతని నుంచి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో హత్యను అంగీకరించాడు. అయితే మార్టినెజ్ అమెరికన్ కాదు. క్యూబన్. అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించాడు. అతని పేరు డిపోర్టు చేసే జాబితాలో ఉంది. పైగా గతంలో చాలా నేరాల్లో నిందితుడిగా ఉన్నాడని అమెరికా పోలీసులు వెల్లడించారు.

# గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం

## సమ్మక్క, సారలమ్మ ఆలయ ఆధునీకరణ

## మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క, లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, మహా :** ఆసియా ఖండములో అత్యంత ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు వారి మనోభావాలకు అనుగుణంగా ఆధునీకరణను చేపడుతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆధునీకరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్.సి. అభివృద్ధి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్ తో కలిసి మంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధునీకరణ పనులకు తుది ఆమోదం తెలిపిన తరువాత తక్షణమే పనులు ప్రారంభించి వంద రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రులు సూచించారు. భక్తులకు మరింత సౌకర్యవంతముగా ఉండేలా చేపట్టే ఆధునీకరణ పనుల్లో గిరిజనుల సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని, ఈ విషయములో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మేడారం ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారని, వచ్చే వారంలో ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నందున తగు ప్రణాళికలు, సమాచారంతో సిద్దంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేలు

## మీ స్పందన తెలపాలంటూ బీఆర్ఎస్ కు స్పీకర్ లేఖ



**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరో ఆసక్తికరమైన మలుపు తిరిగింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణపై స్పందన తెలియజేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ బీఆర్ఎస్ పార్టీని కోరారు. వారి వాదనలపై పార్టీ అభిప్రాయాన్ని మూడు రోజుల్లోగా తెలపాలని సూచిస్తూ లేఖ రాయడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కారు గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీకి దగ్గరైన సంగతి తెలిసిందే. వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఇటీవల స్పీకర్‌ను కలిసిన సదరు ఎమ్మెల్యేలు తమపై వచ్చిన ఆరోపణలపై లిఖితపూర్వకంగా వివరణ సమర్పించారు. ఆ వివరణలో తాము బీఆర్ఎస్ పార్టీని వీడలేదని, ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. కేవలం నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకే ముఖ్యమంత్రిని కలిశామని తెలిపారు. తాము పార్టీ మారినట్లుగా తప్పుడు ప్రచారం చేసేందుకు తమ ఫొటోలను మార్ఫింగ్ చేశారని వారు తమ వివరణలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేల నుంచి ఈ అనూహ్యమైన వివరణ రావడంతో, స్పీకర్ కార్యాలయం తదుపరి చర్యలకు ఉపక్రమించింది. 10 ంది ఎమ్మెల్యేలు చెప్పిన విషయాలపై బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు వారికి లేఖ రాస్తూ, ఎమ్మెల్యేల వివరణపై మీ స్పందన ఏమిటో మూడు రోజుల్లోగా తెలియజేయాలని కోరింది. దీంతో ఇప్పుడు బంతి బీఆర్ఎస్ కోర్టులోకి చేరింది. స్పీకర్ లేఖపై ఆ పార్టీ ఏ విధంగా స్పందించనుందనే దానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**హైదరాబాద్, మహా :** బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం (ఐఎండీ) తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. శనివారం హైదరాబాద్ నగరంతో సహా చుట్టుపక్కల ప్రాంతాలు, జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఆదివారం కూడా పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేసింది. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వర్షాల ప్రభావంతో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ఛాన్స్ ఉందని పేర్కొంది. లోతట్టు ప్రాంతాలు, రహదారులపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయి.. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం కూడా ఉందని, దీనిపై సంబంధిత అధికారులు.. తగిన సూచనలు జారీచేయాలని పేర్కొంది.



# ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

## రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం.. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు హాజరు

**ఢిల్లీ, మహా:** భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తికావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు ఉదయమంతా రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన.. రాత్రికల్లా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు తెలిపారు.



# శంకర్‌పల్లిలో పట్టపగలు దారి దోపిడీ

## స్టీల్ వ్యాపారిని బెదిరించి రూ. 40 లక్షలు చోరీ

**రూ. 40 లక్షలతో పారిపోతుండగా దుండగుల కారు బోల్తా**

**కేసు నమోదు చేసుకుని విచారిస్తున్న పోలీసులు..**

**చేవెళ్ళ, మహా :** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి సమీపంలోని కొత్తపల్లి గ్రామం దగ్గర పట్ట పగలే దుండగులు దారి దోపిడీకి పాల్పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న రాకేష్ అనే స్టీల్ వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని దుండగులు ఏకంగా 40 లక్షల రూపాయలు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనతా స్టీల్ షాప్ నుంచి రూ.40 లక్షల నగదు తీసుకుని వస్తున్న వ్యాపారుల కారు కదలికలను ముందుగానే గమనించిన నలుగురు దుండగులు మరో కారులో ఫాలో అయ్యారు. అయితే, శంకర్‌పల్లి సమీపంలోని కొత్తపల్లి గ్రామం సమీపంలో అదును చూసుకున్న దుండగులు ఒక్కసారిగా స్టీల్ వ్యాపారి కారును ఢీకొట్టి, కారు అద్దాలు ధ్వంసం చేసి కత్తులు, బొమ్మ తుపాకీతో బెదిరించారు. ఇక, కారులో ఉన్న నగదు బ్యాగును బలవంతంగా లాక్కుని తమ వాహనంలో పారిపోతున్న క్రమంలో దుండగుల వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సందర్భంగా రూ.8 లక్షల నగదు బ్యాగును అక్కడే వదిలి పెట్టి, మిగతా డబ్బుతో దుండగులు జంప్ అయ్యారు. ముందుగానే మరో కారును బ్యాకప్‌గా ఉంచుకున్న వారు కొంత దూరం పరిగెత్తి ఆ వాహనంలో ఎక్కి అక్కడి నుంచి పరార్ అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. పారిపోయిన దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఘట్కేసర్‌కు చెందిన రాకేశ్ అనే స్టీల్ వ్యాపారి వికారాబాద్ నుంచి డబ్బులు తీసుకొస్తున్న క్రమంలో పక్కా సమాచారంతో రెక్కీ నిర్వహించి డబ్బులు చోరీ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. బాధితుల సమాచారంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# జడ్జి గదిలో బాంబ్ పెట్టాం!

- ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్
- మూడు చోట్ల ఆర్డీఎక్స్ అమర్చాం అంటూ వార్నింగ్
- బాంబు నిర్వీర్యదళంతో పోలీసులు ముమ్మర తనిఖీలు

**ఢిల్లీ, మహా:** రాజధాని ఢిల్లీలో కొన్ని రోజులుగా వరుస బాంబు బెదిరింపు మెయిల్స్ కలకలం రేపుతున్నాయి. శుక్రవారం ఢిల్లీ హైకోర్టుకు వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్ ఆందోళన సృష్టించింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే న్యాయస్థానం ప్రాంగణాన్ని ఖాళీ చేయించి తనిఖీలు చేపట్టారు. కోర్టులోని ఓ ప్రదేశంలో బాంబు పెట్టామని.. మధ్యాహ్నం 2 గంటల లోపు అక్కడినుంచి అందరినీ బయటకు పంపేయాలని బెదిరింపు మెయిల్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. కనిమొళి తేవిడియా పేరుతో వచ్చిన ఆ మెయిల్‌లో ఈ వారంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కుమారుడిపైనా దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు వెల్లడించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు నిర్వీర్యదళంతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ వచ్చిన ఐపీ అడ్రస్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



# రాసిపెట్టుకోండి

## 2029లో మళ్ళీ మోదీనే..

**నాలుగోసారి ప్రధాని కావడం ఖాయం**

**నాలెడ్జి ఎకానమీగా అమరావతి:చంద్రబాబు**

(మొదటిపేజీ తరువాయి)

అందులో తెలుగు వారి పాత్ర ప్రముఖంగా ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి, రాజకీయ ప్రయోజనాలు.. ఇలా రెండింటి కోసం కష్టపడాల్సిన అవసరముందని తెలిపారు. అందుకే సూపర్ 6 అమలు చేశామని, అభివృద్ధి కోసం మూలధన పెట్టుబడులు పెంచామని పేర్కొన్నారు. వృద్ధి రేటును 17శాతానికి పెంచేలా కృషి చేస్తున్నానని వెల్లడించారు. రాజకీయ ప్రయో జనాల గురించి ఆలోచిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదని చంద్రబాబు తెలిపారు. అమరావతిని నాలెడ్జ్ ఎకానమీగా, క్వాంటం సిటీగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పోలవరం రాష్ట్రానికి ఎంతో కీలకమని, మూడేళ్లలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 740 కిలోమీటర్ల దూరం కృష్ణమ్మను తరలించి రాయలసీమకు, కుప్పానికి నీరు అందించామని వివరించారు. కష్టాల్లోనూ ఈ ఏడాది రాష్ట్రం డబుల్ డిజిట్ గ్రోత్ సాధించిందని తెలిపారు. భవిష్యత్తు కోసమే పోలవరంబనకచర్ల ప్రాజెక్టును తలపెట్టామన్నారు.





# రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు

- నేడు, రేపు శంషాబాద్‌లో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో
- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రతినిధి బృందం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. బీఎన్ఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. బీఎన్ఐ హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధి అనిరుధ్ కొణిజేటితో పాటు మరి కొందరు ముఖ్యమంత్రిని లిసిన వారిలో ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద ఎంఎస్ఎంఈఈ ఎక్స్‌పో పాటు వివిధ అంశాలపై సదస్సులను నిర్వహిస్తుంది. బీఎన్ఐ హైదరాబాద్ చాప్టర్ దాదాపు 400 లకు పైగా పరిశ్రమలు, 4 వేలకు పైగా వ్యాపార యాజమాన్యాల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. వ్యాపార సంబంధాలు, పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమల మధ్య సహకారం వంటి అంశాలను ఈ ఎక్స్‌పోలో చర్చించనున్నారు.

# ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేమిటి?

## రాహుల్ ఆరోపణలకంటే ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- సర్కార్ నడుపుతున్నారా? .. సర్కస్ నడుపుతున్నారా? అంటూ ఫైర్
- మున్సిపల్ శాఖను కేవలం కాసుల వేటకు వాడుకోవడంలో రేవంత్ బిజీ అని వ్యాఖ్య

**హైదరాబాద్, మహా:** పార్టీ మారిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ మార్చిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిశారని గుర్తు చేశారు. వారితో తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో చూపించి - "ఇవ్వాళ వీళ్లను మీరు గుర్తుపట్టగలరా?" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు "మేము కాంగ్రెస్‌లో చేరలేదు" అని చెప్పడాన్ని కేటీఆర్ ఈ పోస్టులో ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కండువా కాదు అని అంటున్నారు, మీరు దీన్ని ఒప్పుకుంటారా అని కేటీఆర్ ప్రశ్నించారు. "ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేమిటి?" అంటూ రాహుల్ గాంధీని నిలదీశారు. ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకంటే, ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదని వ్యాఖ్యానించారు. ఈ ద్వంద ప్రమాణాలపై రాహుల్ గాంధీకి సిగ్గు లేదని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.



**కాసుల వేటకు వాడుకోవడంలో రేవంత్ బిజీ..**

సర్కార్ నడుపుతున్నారా?.. సర్కస్ నడుపుతున్నారా? అంటూ రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల నగరంలో నిన్న ఒక చిన్నారి తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్‌లో పడిపోయిందని.. అదృష్టవశాత్తూ పాప ప్రాణాలు దక్కాయి. చేసిన తప్పును దిద్దుకోవాల్సిన మున్సిపల్ శాఖలోని మూడు విభాగాలేమో ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి'' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. ''తప్పు హైడ్రాది అని జీహెచ్ఎంసీ ప్రకటిస్తే.. తప్పు మాది కాదు జల మండలిది అని హైడ్రా చేతులు దులుపుకుంది. ఆ వెంటనే అసలు మాకేం సంబంధం లేదని జలమండలి చేతులెత్తేసింది!. మున్సిపల్ శాఖను కేవలం కాసుల వేటకు వాడుకోవడంలో రేవంత్ బిజీగా ఉంటే, ఆయన శాఖలోని విభాగాలేమో సమన్వయలేమితో నగరవాసులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి'' అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆదాయ లక్ష్యాలు అందుకోవాలి

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెరగాలి
- కమర్షియల్ టాక్స్ అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, మహా :** నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ యంత్రాంగం యావత్తు కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం కమర్షియల్ టాక్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కమర్షియల్ ట్యాక్స్ శాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. జీఎస్టీ రేట్ రేషనలైజేషన్ ద్వారా రాష్ట్రం కోల్పోతున్న ఆదాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఓ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జీఎస్టీ ఎగవేత దారుల పైన కఠినంగా వ్యవహరించాలని, అదే విధంగా నిఘా వ్యవస్థ నిరంతరం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత స్థాయి అధికారులు నిత్యం ఏఐ టెక్నాలజీని వినియోగించుకుని పర్యవేక్షణ సాగించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లావాదేవీలు పన్నుల వసూలులో వస్తున్న సమస్యలను అధిగమించడానికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. గత ఏడాదికి ఈ ఏడాదికి కమర్షియల్ ట్యాక్స్ శాఖలోని ఎన్ఫోర్స్మెంట్, ఆడిట్ తదితర విభాగాల్లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ శాఖలో అంతర్గతంగా కమిటీలు వేసి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏ రిజ్వీ, కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, డిప్యూటీ కమిషనర్లు సౌజన్య, వాసవి, సంయుక్తారాణి, సునీత, గీత తదితరులు పాల్గొన్నారు.

# కవిత ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదు?

## కేటీఆర్‌కు మంత్రి జూపల్లి కౌంటర్

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నప్పుడు సిగ్గు అనే పదం కేటీఆర్ కు గుర్తుకు రాలేదా అంటూ ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి జూపల్లి కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిగ్గుందా అనే పదం ఇప్పుడు కేటీఆర్‌కు గుర్తు వచ్చిందా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా చట్ట ప్రకారమే చేస్తుందన్నారు. అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రిని కలిశామని ఆ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. స్పీకర్ చట్టప్రకారం నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ ఒక్క పనైనా చేశారా? వేల కోట్ల రూపాయల అక్రమార్జన జరిగిందని కేసీఆర్ కూతురు కవితనే చెప్తోంది. ఈ ఆరోపణలపై కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని సూటిగా ప్రశ్నించారు. కవిత అంశంపై స్పందిస్తే ఒకరి బండారం ఒకరు బయటపెట్టుకోవాల్సి వస్తుందని ఎవరూ నోరెత్తడం లేదని తీవ్ర విమర్శలు చేశారు.



# ఒక్కరోజే రూ.63,77,361ల ఆదాయం

## ఫ్యాన్సీ నంబర్లతో రవాణా శాఖకు కాసుల పంట

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రవాణాశాఖకు ఫ్యాన్సీ నంబర్లతో కాసులపంట పండింది. ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి ఫ్యాన్సీ నంబర్లతో ఒక్క రోజే రూ.63,77,361 ఆదాయం సమకూరింది. అత్యధికంగా TG 09 G 9999 నంబర్‌కు భారీ ధర పలికింది. ఈ నంబర్‌ను హెటెరో డ్రగ్స్ యజమాని రూ.25,50,200లకు దక్కించుకున్నారు. TG 09 H 0009 నంబర్‌ను ఏఆర్ఎల్ టైర్స్ లిమిటెడ్ యాజమాన్యం రూ.6,50,009లకు, TG 09 H 0001 నంబర్‌ను డాక్టర్ రాజేశ్వరీస్ స్కిన్ అండ్ హెయిర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం రూ.6,25,999లకు, TG 09 H 0006 నంబర్‌ను ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం రూ.5,11,666 లకు, TG 09 H 0005 నంబర్‌ను వెంకటేశ్వరరావు శృంగవరపు రూ.2,22,000లకు దక్కించుకున్నారు.











ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్
13-09-2025
WWW.MAHAADAILY.COM



# పండుగ వేళ.. ఆఫర్ల మోత

## అటు ఫ్లిఫ్ కార్ట్.. ఇటు అమెజాన్

## బిగ్ బిలియన్ డేస్

### జీఎస్టీ తగ్గింపుతో దిగివచ్చిన కార్ల ధరలు

### బంగారం నుండి కార్ల దాకా.. వస్త్రాల నుండి వస్తువుల దాకా

### మానేపల్లి జ్యూయలర్స్ లో బంగారంపై స్పెషల్ ఆఫర్స్

(మహా బిజినెస్ బ్యూరో)

ఆఫర్లు దుమ్మురేపుతున్నాయి. అసలే పండుగల సీజన్. వీటికి తోడు భారీగా తగ్గిన జీఎస్టీ స్లాబ్స్. దీంతో కొనుగోలుదారులను సరికొత్త ఆఫర్లు టెంప్ట్ చేస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ మరియు అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ వంటి ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌ల నుండి భారీ తగ్గింపులు, డిస్కౌంట్లు ఆఫర్‌లు వినియోగదారులను ఊరిస్తున్నాయి. బంగారం నుండి కార్ల దాకా, వస్తువుల నుండి వస్త్రాల దాకా.. ఎన్నో క్రేజీ ఆఫర్లు. మానేపల్లి జ్యూయలర్స్ లో బంగారంపై, నగలపై స్పెషల్ ఆఫర్లు ప్రకటించారు.

### ఈ నెల 23 నుంచి ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ ప్రారంభం

ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ నిర్వహించే బిగ్ బిలియన్ డేస్ సేల్ కోసం ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్ ప్రియులకు శుభవార్త. ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా సేల్‌లో యాపిల్ ఐఫోన్ 16పై అందించనున్న భారీ డిస్కౌంట్‌ను ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా వెల్లడించింది. ఎలాంటి షరతులు లేకుండానే ఐఫోన్ 16 బేస్ వేరియంట్‌ను కేవలం రూ. 51,999 ప్రత్యేక ధరకే అందిస్తున్నట్లు ప్రకటించింది. ఫ్లిప్‌కార్ట్ మొబైల్ యాప్‌లోని సేల్ పేజీలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. "మీరు చూస్తున్నదే మీరు చెల్లించే ధర" అనే ట్యాగ్‌లైన్‌తో ఈ ఆఫర్‌ను ప్రదర్శించింది. అంటే, ఈ ధరలో ఎలాంటి బ్యాంకు ఆఫర్లు కలపలేదని, ఇది నికర ధర అని సంస్థ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్‌లో ఐఫోన్ 16 (128జిబి) ధర రూ. 74,900గా ఉంది. సేల్ సమయంలో ఈ ఫోన్‌పై దాదాపు రూ. 23,000 వరకు భారీ తగ్గింపు లభించనుంది. దీనికి అదనంగా, యాక్సిస్ మరియు ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులు ఉన్న వినియోగదారులు మరో 10 శాతం తక్షణ తగ్గింపును కూడా పొందవచ్చు. ఇటీవల భారత మార్కెట్లో ఐఫోన్ 17 సిరీస్ విడుదలైన తర్వాత ఐఫోన్ 16 ధర తగ్గిన విషయం తెలిసిందే. యాపిల్ అధికారిక వెబ్‌సైట్‌లో దీని ధర రూ. 69,900గా ఉంది. గతేడాది విడుదలైనప్పుడు దీని ప్రారంభ ధర రూ. 79,900గా ఉండేది. ఈ లెక్కన చూస్తే, బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో లభించే ఆఫర్ అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఐఫోన్ 16తో పాటు స్మార్ట్‌వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు వంటి ఎన్నో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై కూడా భారీ డిస్కౌంట్లు ఉండనున్నాయి.

### పండుగ వేళ... కియా ఆఫర్ల మోత

పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా ఇండియా తమ వినియోగదారులకు ఓ బంపరాఫర్ ప్రకటించింది. ఎంపిక చేసిన మోడళ్లపై గరిష్ఠంగా రూ. 2.25 లక్షల వరకు భారీ ప్రయోజనాలను అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఆఫర్‌లో ప్రీజీఎస్టీ ఆదాతో పాటు పండుగ ప్రత్యేక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 22 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. కియా అందిస్తున్న ఈ ఆఫర్లు ప్రాంతాన్ని బట్టి మారుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కియా సెల్టోస్ మోడల్‌పై గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు తగ్గింపు లభిస్తోంది. ఇదే రాష్ట్రాల్లో కారెన్స్ క్లావిస్ మోడల్‌పై రూ. 1,33,350 వరకు, కారెన్స్ కారుపై రూ. 1,20,500 వరకు ప్రయోజనాలు పొందవచ్చు. దేశవ్యాప్తంగా చూస్తే కేరళలో సెల్టోస్‌పై అత్యధికంగా రూ. 2.25 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. ఈ ఆఫర్‌లో భాగంగా ప్రీజీఎస్టీ కింద రూ. 58,000 వరకు, పండుగ ప్రయోజనాల రూపంలో రూ. 1.67 లక్షల వరకు లాభం చేకూరుతుందని కంపెనీ తెలిపింది. సెల్టోస్, కారెన్స్ క్లావిస్, కారెన్స్ వంటి పాపులర్ మోడళ్లకు ఈ ఆఫర్లు వర్తిస్తాయి.

### 22 వరకూ ఆగుదాం

దసరా, దీపావళి పండగ ఆనందాలు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సవరణతో రెట్టింపు కానుంది. ఇటీవల కేంద్రం సవరించిన జీఎస్టీ శ్లాబులు ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. గతంతో పోలిస్తే ఆటో మొబైల్స్, ఎలక్ట్రానిక్ వంటి చాలా వరకు ఉత్పత్తుల ధరలు సుమారు 10 శాతం మేర తగ్గనున్నాయి. దీంతో వాహనాలు, టీవీలు, కార్లు, సెల్‌ఫోన్లు వంటి ఉత్పత్తుల కొనుగోలుదారులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఈ నెల 22 వరకూ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. మరోవైపు ఈ-కామర్స్ సంస్థలు కూడా ఈ నెల 22 తర్వాతే ఆఫర్లను అందించేలా భారీ డిస్కౌంట్ ఆఫర్లతో రెడీగా ఉన్నాయి.

### ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీలు సైతం..

స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ఏసీలు, వాషింగ్ మిషన్లు, డిష్‌వాషర్లు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై కూడా కేంద్రం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించింది. ఇప్పటివరకు వీటిపై 28 శాతం పన్ను విధించగా, ఇప్పుడవి 18 శాతం జీఎస్టీ శ్లాబ్‌లోకి వెళ్లాయి. దీంతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు కూడా భారీగానే తగ్గుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీవీలపై రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు, మొబైల్ ఫోన్లపై రూ.2 వేల నుంచి రూ.5 వేలు, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్లపై రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు తగ్గింపు ఉండే అవకాశం ఉండటంతో కొనుగోళ్ల వాయిదాకే జనం మొగ్గు చూపుతున్నారు.

### కనీవినీ ఎరుగని డీల్స్

అమెజాన్ తన ఫెస్టివల్ సేల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపింది. బ్లాక్‌బస్టర్ డీల్స్, ట్రెండింగ్ డీల్స్, టాప్ 100 డీల్స్ వంటి అనేక రకాల సదుపాయాలను అమెజాన్ అందించనున్నట్లు తెలుస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్, డెబిట్ కార్డులపై 10 శాతం తక్షణ తగ్గింపుతో పాటు ఈఎంఐ లావాదేవీలతో సహా ప్రత్యేక బ్యాంక్ ఆఫర్‌లు కూడా అందుబాటులో ఉంటాయి. ఎక్స్ఛేంజ్ ఆఫర్స్ కూడా లభించనున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఫ్యాషన్ వంటి వాటిపై భారీ డిస్కౌంట్స్, ఆఫర్స్ అందిస్తాయి. సేల్‌లో యాపిల్, శాంసంగ్, ఐకూ, వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్లు 40 శాతం వరకు డిస్కౌంట్‌తో లభించనున్నాయి. హెచ్‌పీ, శాంసంగ్, సోనీ, బోట్ ఎలక్ట్రానిక్స్‌పై 80 శాతం వరకు రాయితీలు ఉంటాయి. గృహోపకరణాలు (ఎల్‌జీ, శాంసంగ్, హైయర్, గోద్రెజ్)పై 65 శాతం వరకు డిస్కౌంట్ అందించనున్నారు. అలాగే సోనీ, శాంసంగ్, ఎల్జీ, షావోమీ స్మార్ట్ టీవీలు, ప్రొజెక్టర్లు 65 శాతం వరకు తక్కువ ధరలకు లభిస్తాయి. అమెజాన్ అలెక్సా, ఫైర్ టీవీ, కిండిల్ ఇరీడర్స్ వంటి స్మార్ట్ హోమ్ డివైస్‌లను 50 శాతం వరకు డిస్కౌంట్‌తో అందించనుంది. విమాన టికెట్లపై కూడా 65 శాతం వరకు ఆఫర్లు ఉంటాయి.












# సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి తో పాటు సీఎం సహాయ నిధి చెక్కులను కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన సుమారు 80 మంది లబ్ధిదారులకు 24 లక్షల రూపాయల చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రా అర్థిక పరిస్థితి బాగాలేకున్న పేద ప్రజలను అదుకొవలని, వారికి అండగా ఉండాలనె ఉద్దేశంతో ఒక్క వైపు ఆరోగ్య శ్రీ వైద్యం చేయిస్తూ మరోపక్క సియం రిలీఫ్ పండు చెక్కులు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు మహా:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమనగల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి సుమారు 30 మంది ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యార్థుల ఉన్నతికి మరింతగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండు, లైన్స్ క్లబ్ గవర్నర్ మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, జోన్ చైర్మన్ లింగయ్య, క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి,జిల్లా చైర్మన్ యాదయ్య,ప్రోగ్రాం చైర్మన్ సుధీర్ రెడ్డి, చంద్రశేఖర్, రమేష్,క్లబ్ సభ్యులు కొండల్ రెడ్డి,పాండురెడ్డి,మధు, సత్యం,మధుసూదన్ రెడ్డి,పిఆర్వో భాష, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

**ఉత్తమ ఉపాధ్యాయులు వీరే**

ఆమనగల్లు మండలం నుండి హైమావతి(లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్), చందర్ ( జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), నరేష్(అరబిందో హైస్కూల్), పుష్పాంజలి(ఎస్ జి టి ), కడ్తాల్ మండలం నుండి కౌసల్య (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), రాజు (ఎక్వాయి పల్లి పాఠశాల),విష్ణు (కడ్తాల్ గ్రామర్ స్కూల్),జైసన్ (ప్రగతి హై స్కూల్), తలకొండపల్లి మండలం నుండి మీనా కుమారి (జంగారెడ్డి పల్లి ఎస్జిటి), స్వాతి (అక్షర హై స్కూల్), లక్ష్మణ్ (విశ్వవిజేత హై స్కూల్), మణిపాల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్), పాండు (ఎంపీపీ ఎస్ చుక్కాపూర్), మాడుగుల మండలం నుండి ప్రభాకర్ రెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలు కులపల్లి ), కళ (ఎంపీపీ ఎస్ కలకొండ ), శ్రీనివాసులు (నవోదయ విద్యాలయము), వైకుత్తన్ (సెంట్ మేరీ హై స్కూల్), కల్వకుర్తి మండలం నుండి (మోహన్ సరస్వతి శిశు మందిర్), శివకుమార్ (బ్రిలియంట్ (గ్రామర్ హైస్కూల్ ), రాజేశ్వరి (తర్నికల్ ఎస్జిటి),వజ్ర లింగం( జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ), అనంతరావు (లింగరావుపల్లి ), వెల్దండ మండలం నుండి రాజశేఖర్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), విష్ణువర్ధన్ (గొల్లోనిపల్లి ),లచ్చిరాం (రామన్ కాన్వెంట్ స్కూల్ పెద్దాపూర్ ), అంజయ్య (తక్షశిల హై స్కూల్.

# సృష్టికర్త ఒక్కడే ఆయనకు ఎవరూ సాటిరారు

- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి
- మహ్మద్ ప్రవక్త ముఖ్యమైన భోధనలు కావాలి ఆదర్శం
- జహంగీర్ పీర్ దర్గాలో మైనార్టీలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు
- బాబా భక్తులకు అన్నదానం చేసిన మాజీ ఎమ్మెల్యే



**షాద్ నగర్, మహా:** సృష్టికర్త ఒక్కడే, అయనకు ఎవరూ సాటిరారు.. అత్యంత దయామయుడు కరణామయుడు. త్రిలోకాధిపతి అజేయుడనీ ముస్లిం సమాజానికి దిక్సూచిగా నిలిచి సమాజాన్ని చైతన్యవంతం చేసి మంచి దారిలో నడిపించిన మహాత్ముడు మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలం హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాలో కడప పీర్ భాయ్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి సందర్భంగా ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబాకు దట్టిలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. భక్తులు ఎంతోమంది సామాజిక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. మహమ్మద్ ప్రవక్త చూపిన ఆశయ సాధనలో సంవత్సరంలో ఒక నెల రంజాన్ లో ఉపవాసం వుండాలనీ తన సంపాదన లో ఒక వంతు అత్యంత పేదవారికి దానం చేయాలి ( జకాత్) ఇచ్చే విధంగా అదెందుకు శివ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా ప్రతి రోజు 5 పూటలు నమాజ్ భగవన్నామస్మరణం చేయాలి, ప్రాతఃకాలం, మిట్ట మధ్యాహ్నం, గోధూళివేళ, అసురసంధ్య, మరియు పడుకునేముందు ప్రార్థనలు చేసి ఇతరులకు ఆదర్శంగా ఉంటారని అన్నారు. జీవితంలో ఒకసారి తన కష్టార్జితంతో హజ్ చేయాలి, అదికూడ తన భాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించిన తరువాత తన ఆస్తిని సరిసమానంగా తన సంతానానికి పంచిపెట్టాలి, ఆ తరువాతనే హజ్ స్వీకరించబడుతుందనీ ఎన్నో కఠోర నియమాలతో ఇస్లాం మతం ముడిపడి ఉందని అలాంటి మతంలో పుట్టి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ముస్లింలకు ముఖ్యంగా భక్తులకు అందరికీ తన అభివందనాలు తెలిపారు..

# రాజీ మార్గమే రాజమార్గం

**సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్**

**ఆమనగల్లు, మహా:** ఈ నెల 10 తేదీ నుండి 13 తేది వరకు ఆమనగల్లు కోర్టు ఆవరణలో నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్ఐ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఇది మంచి అవకాశమన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు, స్నేహభావంతో మెలగడానికి లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని తెలిపారు. ఇక్కడ రాజీ కుదుర్చుకున్న కేసులపై అప్పీలుకు అవకాశం ఉండదని చెప్పారు. అదేవిధంగా డ్రంకన్‌డ్రైవ్, ఎక్సైజ్ కేసులు, అక్రమ ఇసుక రవాణా కేసుల్లో పట్టుబడిన నిందితులు నేరం ఒప్పుకుంటే వారికి జరిమానా విధించి కేసులు కొట్టివేస్తామని తెలిపారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

**రాజేంద్రనగర్ మహా ;** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అడవి శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరులో జరిగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలకు టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు, సీనియర్ నాయకుడు గణేష్, సురేష్, చంద్రశేఖర్, ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. టిడబ్ల్యూజేఎఫ్ మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జేఎఫ్ నేషనల్ కమిటీ సభ్యులు దేవేందర్, టిడబ్ల్యుజేఎఫ్ డివిజన్ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి బుచ్చయ్య, రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కలాల్ సుదర్శన్ గౌడ్, మెతుకు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, శ్రీనివాస్, విజయ్, శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## హిమాయత్ సాగర్ మూసిలో సందర్శకుల తాకిడి

**రాజేంద్రనగర్ మహా ;** ఎగువన కురిసిన భారీ వర్షానికి హిమాయత్ సాగర్ నిండుకుండలా మారింది. శుక్రవారం హిమాయత్ సాగర్ నాలుగు గేట్లను ఎత్తడంతో హిమాయత్ సాగర్ దిగువ ప్రాంతం జలమయమయ్యాయి. హిమాయత్ సాగర్ మూసి కాలువలో సందర్శకులు సరదాగా స్నేహితులతో కాసేపు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. పోలీస్ వ్యవస్థ జలమండలి అధికారులు ఎవరూ లేకపోవడంతో గంటల కొద్ది సందర్శకులు హల్చల్ చేశారు. పారే మూసిలో ఇష్టానుసారంగా సందర్శకులు గడుపుతున్నారు. జలమండలి అధికారులు గేట్లు ఎత్తి హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సందర్శకులు భయపడకుండా పారే మూసిలో సందడి చేస్తున్నారు.

# 62 లక్షల విలువ గల గంజాయి పట్టివేత



**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో గంజాయి సాగు, రవాణా లేకుండా చేస్తామని గాంజా పై ఉక్కు పాదం మోపుతామని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషనల్ మీడియాకు ఆయన వివరాలు వెల్లడించారు. తోషం గ్రామ శివారులో అంతర పంటగా గంజాయి మొక్కలు పండిస్తున్న విషయాన్ని తెలుసుకుని 627 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సాగు చేస్తున్న తండ్రీ ఇద్దరు కుమారులపై కేసులు నమోదు చేసి మర్సుకోల దేవరావును అరెస్ట్ చేసినట్టు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు చెప్పారు. పట్టుకున్న గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో 62 లక్షలకుపైగా ఉంటుదన్నారు. గంజాయి పండిచేవారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేస్తామన్నారు. అలాగే గంజాయి పై 8712659973 నంబర్ కి వాట్సాప్ ద్వారా సమాచారం ఇస్తే నేరుగా జిల్లా ఎస్పీకి అందించబడుతుందని తెలిపారు. సమాచారం అందించిన వారికి రివార్డులు ఇవ్వడంతో వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 120 గంజాయి కేసులు నమోదు కాగా అందులో 40 కిలోల వరకు ఎండు గంజాయి, 600 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ కేసులలో 240 మంది వరకు నిందితులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.



## జిహెచ్ఎంసి అధికారులు క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేత

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా శుక్రవారం జిహెచ్ఎంసి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇంచార్జ్ శ్రీకాంత్ శిక్షణ పొందుతున్న వివిధ క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్నా క్రీడాకారులు ఎంచుకున్న క్రీడల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ నర్సింగరావు. స్కేటింగ్ కోచ్ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య పరిరక్షణకే ముఖ్యమంత్రి సహాయ నిధి: కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మహా:** పేదల ఆరోగ్య పరిరక్షణకే ముఖ్యమంత్రి సహాయనిధి అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన బద్రిపల్లి నర్సింహ కి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును తన నివాసంలో అందజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలందరికి వరంలా మారిందని, సీఎంఆర్ఎఫ్ పథకంతో పేదలకు కార్పొరేట్ దవఖానల్లో వైద్యం అందుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు సుమన్ గౌడ్ ,శ్రీశైలం యాదవ్ ,సుంకయ్య గౌడ్ ,ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు

## నేడు జర్నలిస్టులకు మొబైల్ హెల్త్ క్యాంపు

**ఆమనగల్లు, మహా:** కల్వకుర్తి నియోజకవర్గంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం,రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి,మాడుగుల మండలాల్లో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్యం, సంక్షేమం కోసం శనివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడి హాబ్ సహకారంతో ఆమనగల్లు పట్టణ కేంద్రంలోనిఐక్యత ఫౌండేషన్ కార్యాలయం నందు హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.సమాజానికిసమాచారాన్ని చేరవేసే జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని,ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

# రైతులెవరు ఆందోళన చెందవద్దు

**జిల్లా వ్యవసాయ అధికారిని ఉష**



**రంగారెడ్డి జిల్లా మహా:** రైతులకు అవసరమైన యూరియా నిరంతరం సరఫరా అవుతుందని జిల్లా వ్యవసాయ అధికారిని ఉషా అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం, మంగళపల్లి పటేల్ గూడలోని పిఎసిఎస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన, యూరియా విక్రయ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారిని ఉష అకస్మిక తనిఖి చేశారు. గోదాములో ఉన్న యూరియా నిల్వలను, ఈ పాస్ ద్వారా జరుగుతున్న అమ్మకాలను, ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజుతో కలిసి, ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి, ఉష మాట్లాడుతూ... జిల్లా రైతులకు అవసరమైన యూరియా నిరంతరం సరఫరా అవుతుందని అధిక మొత్తంలో యూరియా బస్తాలు కొని విలువ చేయవలసిన అవసరం లేదని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో గత వానాకాలంలో 860 టన్నుల యూరియా సరఫరా కాగా, ఈ సీజన్లో ఇప్పటికే 850 టన్నులు సరఫరా అయిందని, మరో వారం రోజుల్లో 60 టన్నుల యూరియా రానుందని తెలిపారు. అనంతరం మంగళపల్లి పటేల్ గూడకు చెందిన రైతు, మెట్టు అశోక్ రెడ్డి పండిస్తున్న, వరి రకం కేఎన్ఎం 1638 పిజె టీఎస్ఏయు అనే రకం చేనును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్ రెడ్డి, ఏడిఏ పద్మజ, సుజాత, ఏఓ హరినాథ్, ఎంఏఓ విద్యాదరి, ఏఈఓ శ్రవణ్, పిఎసిఎస్ సెక్రటరీ మాధవి, సిఐ మహేందర్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

**టిడబ్ల్యూ జెఎఫ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మిషన్ భగీరథ**

**మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్**




**ఆమనగల్లు, మహా:** ప్రతినిత్యం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ప్రజా సమస్యలపై పోరాడుతున్న జర్నలిస్టుల సంక్షేమాన్నికి ప్రభుత్వం కట్టబడి ఉండాలని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ అన్నారు.టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3 వ మహాసభలను విజయవంతం చేయడానికి ఈనెల 27న మహేశ్వరంనియోజకవర్గానికి చెందిన కందుకూరు మండలంలోని శుభం గార్డెన్ లో నిర్వహించే బహిరంగ సభ కరపత్రాన్ని శుక్రవారం రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ చేతుల మీదుగా తన నివాసంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతిరోజు జర్నలిస్టులు ప్రచురించే వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేస్తున్నారని అన్నారు. తప్పులు చేసే అధికారులను నేతలను వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ దిశా నిర్దేశం చేసేవాళ్లను ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, అమంగల్ బ్లాక్ సమన్వయ కమిటీ అధ్యక్షులు యూనుసు, సమన్వయ కమిటీ ఉపాధ్యక్షులు కాడిగే. చంద్రకుమార్, బ్లాక్ అధ్యక్షులు దరువుల. శంకర్, గౌరవ అధ్యక్షులు రాచాలపల్లిన రసింహ,ఉపాధ్యక్షులునాయకులు చప్పిడి తిరుపతి, ఉప్పల చాటబుల్ ట్రస్ట్ సభ్యులు తావుర్య నాయక్, విజేందర్ రెడ్డి, బుచ్చిబాబు, శివకుమార్, వీరన్నపల్లి రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ప్రవేశం కొరకు స్పాట్ అడ్మిషన్లు

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, మొదటి సంవత్సరంలో చేరుటకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కమిషనర్ కళాశాల విద్య వారు, ఈనెల 15,16తేదీలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. కావున ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు, అలాగే రిజిస్ట్రేషన్ చేసుకుని సీటు పొందని వారు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు వచ్చి, సీట్లు ఖాళీగా ఉన్న కోర్సులలో చేరవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక ఒక ప్రకటనలో తెలియజేశారు. ఖాళీల వివరాలు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి తెలుసుకోగలరు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశమును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా లో కడప పీర్ భాయ్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర పార్టీ శ్రేణులు మైనార్టీ నాయకులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప పీర్ ఏర్పాటుచేసిన దట్టిలను హాజరత్ జహంగీర్ పీర్ బాబాకు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. కడప పీర్ భాయ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక ఫాతిహాలకు తనను ఆహ్వానించడం ఆనందంగా ఉందని ఇలాంటి ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలను ఎల్లప్పుడూ చేపడుతుండడం జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధి కోసం పాటుపడుతూ ఉండడం సంతోషమని అన్నారు. జేపీ దర్గా అభివృద్ధికి మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ తదితరులను ఘనంగా సన్మానించారు..

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

- ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుంది
- విద్యతోనే సమాజం బాగుపడుతుంది
- విద్యార్థులు సంస్కృతిక నృత్యాలతో అలరించారు




**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేస్తూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే అన్నారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల నియోజకవర్గంలో, ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా, శంకర్ పల్లి, షాబాద్ మండలాలలోని పాఠశాలలకు చెందిన, ఉత్తమ ఉపాధ్యాయులను, స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య సన్మానించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, వందేమాతరం గీతం ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేస్తూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. విద్యతోనే సమాజం బాగుపడుతుందని అన్నారు. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యా రంగ అభివృద్ధి కోసం, ఎమ్మెల్యే తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసి, బహుమతులను అందజేశారు.

# సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి: యాచారంలో ఘనంగా నివాళులు




**రంగారెడ్డి జిల్లా మహా:** దేశ రాజకీయ రంగంలో సీతారాం ఏచూరి లేని వెలితి స్పష్టంగా కనిపిస్తుందని సిపిఎం నాయకులు అన్నారు. దివంగత సిపిఎం పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా, రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మంతన్ గౌరెల్లి, మాల్ గ్రామాలలో, సిపిఎం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు, ఎస్ చందు నాయక్, మండల నాయకులు మాజీ ఎంపీటీసీ కే తావునాయక్ మాట్లాడుతూ... భారతదేశ రాజకీయ రంగంలో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు యోధుల్లో ఒకరు సీతారాం ఏచూరి అని, మార్క్స సిద్ధాంతాన్ని భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా అన్వయింపజేసి, దోపిడి, పీడన, కుల వివక్ష అంటరానితనం ఉన్నంత వరకు, ఎర్రజెండా ఎప్పుడు పేదలకు ఆచరించుకొని ఉంటుందని అన్నారు. పోరాటాల ద్వారానే భారతదేశ సమస్యలు పరిష్కారమైతావని, దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు దిక్సూచిగా నిలబడిన మేధావి సీతారాం ఏచూరి అని అన్నారు. భారత రాజ్యాంగ మౌలిక విలువలు అయిన ప్రజాస్వామ్యం లౌకికవాదం ఫెడరలిజం సామాజిక న్యాయం సమానత్వం భారత రాజ్యాంగ రక్షణకై అనేక ఉద్యమాలు నడిపిన వ్యక్తి అని కొనియాడారు. మతోన్మాద శక్తులు దేశంలో కులమత ప్రాత్పాదికన ప్రజలను విడగొట్టి అనేక విధ్వంసాలు సృష్టించాలనుకున్న ప్రతిసారి, పార్టీ శ్రేణులను ఐక్యపరిచి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలకు రూపకల్పన చేశారన్నారు. ప్రపంచంలో ఉన్న సోషలిస్టు దేశాలలో కలియతిరిగి ఆర్థిక సంక్షోభాలు ఎదుర్కొంటున్న దేశాలకు, వామపక్ష ఆలోచనలను నూరిపోసిన గొప్ప మేధావి అని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష ఆలోచనలను వంట పట్టించుకోని, సిపిఎం పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ, అఖిల భారత స్థాయిలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ, అకాల మరణం పార్టీకి తీరని లోటు అని భావోద్వేగం వ్యక్తం చేశారు. పార్లమెంటు రంగంలో రాజ్యసభ సభ్యులుగా ఉండి దేశ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన పెంచుకొని, ప్రజల సమస్యలపై ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పార్లమెంటులో అనేక సందర్భాలలో గళం విప్పారని, ఆయన వాగ్చాతుర్యం ఇతర ప్రతిపక్షాలు కూడా మెచ్చుకొని పోరాటాలలో భాగస్వామ్యం అయ్యే వారని, సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సందర్భాలలో సీతారాం ఏచూరి ప్రతిపక్షాలను సహనంతో సమన్వయంతో ఐక్యపరచి, సంకీర్ణ ప్రభుత్వాలు నడిపించే వారని అన్నారు. రాబోయే కాలంలో ఆయన ఆశించి నడిచిన మార్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కై, వర్గ పోరాటాలు నిర్వహిస్తూనే సమ సమాజ స్థాపన కై నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు కందుల శ్రీ రాములు, బట్టు సత్యనారాయణ, పార్టీ నాయకులు కర్నాటి పెద్దయ్య, కే కుమార్, బట్టు జంగయ్య, ఎస్ రవి నాయక్, గోపాల్, రాములు, సాయికుమార్, వెంకటయ్య, రాములు, లక్ష్మయ్య, యాదయ్య, కవిత, మణెమ్మ, అశ్విని, మారెమ్మ, దశరథ తదితరులు పాల్గొన్నారు.



## కాగజ్‌నగర్ హోటళ్లపై ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల దాడులు

**కాగజ్ నగర్ మహా:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టౌన్‌లో అక్రమంగా వినియోగిస్తున్న రాయితీ గ్యాస్ సిలిండర్లపై ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ దాడుల్లో పలువురు హోటళ్ల యజమానులు ప్రభుత్వ రాయితీ గ్యాస్‌ను కమర్షియల్ ఉపయోగానికి దుర్వినియోగం చేస్తున్నట్లు వెల్లడైంది. పట్టణంలోని కాకతీయ మెస్, అన్నపూర్ణ హోటల్, రుమన్ కళ్యాణి బిర్యానీ, ఆదిత్య పర్మిట్ రూమ్, శ్రీ హోటల్, పంకజ్ దాబా, సంగీత హోటల్, సలాసర్ స్వీట్ హౌస్ లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 17 రాయితీ గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. ప్రభుత్వ సబ్సిడీపై అందుతున్న గ్యాస్‌ను కమర్షియల్ వినియోగానికి ఉపయోగించడం నిషిద్ధమని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మధుకర్ హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వాణిజ్య విభాగాల్లో కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు మాత్రమే వాడాలని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాలనలో కాంగ్రెస్ మార్పు చూపించాం

### మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**కాటారం, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో మార్పు చేసి చూపించిందని గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు, పేదలకు సన్న బియ్యం ఇవ్వడం ద్వారా మార్పు చూపించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మహా ముత్తారం మండలం బోర్లగూడెంలో 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ, 12 లక్షలతో నిర్మించనున్న అంగన్ వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మారు మూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, అంగన్ వాడి కేంద్రాలు, పంచాయతీ భవనాలు వంటి ప్రజా సదుపాయాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా మురుగు కాల్వలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. పేదల జీవితాల్లో మార్పుకు కృషి చేస్తున్నామని ఆ క్రమంలోనే రేషన్ కార్డులు, పేదలకు, సన్న బియ్యం, 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్తు, 500లకే సబ్సిడీపై సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర సభ్యులు రమేష్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజా బాపు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిర్మల సమ్మయ్య, పి ఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డిసిసి ఉపాధ్యక్షులు గద్దె సమ్మిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ రైతు సెల్ అధ్యక్షుడు వంశవర్ధన్ రావు, ఏ ఎం సి డైరెక్టర్ పిల్మమారి రమేష్, ఎంపీడీఓ , తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఏఐ విద్యాబోధన మంత్రి శ్రీధర్ బాబు



**మహా:** భూపాలపల్లి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన ఏ ఐ ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మహా ముత్తారం మండలంలో 2 కోట్ల 30 లక్షలతో నిర్మించిన కేజీబివి జూనియర్ కళాశాల భవనం ప్రారంభోత్సవం, మండలంలోని వివిధ గ్రామాల్లో 70 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి, 72 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవనాలు, 7 గ్రామ పంచాయతీల్లో 1 కోటి 40 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విద్యకు పెద్ద పీట వేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నాణ్యమైన విద్యాబోధనకు డీఎస్సీ నిర్వహించి టీచర్ల నియామకం చేపట్టామని, 10 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తమ కాళ్ళపై తాము నిలబడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. నా కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బంది లేకపోవడం వల్ల నన్ను ఆంగ్లమాధ్యమంలో చదివానని, నాలాగే విద్యార్థులు ఇంగ్లీష్ లో చదవాలని, బాలికా విద్యకు ఇబ్బంది కలగకూడదని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో మన ప్రాంతానికి పెద్ద ఎత్తున కేజీబివి, మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఒక ప్లాన్ ప్రకారం ప్రతి రోజూ ఏదో ఒక పుస్తకం ఖచ్చితంగా చదవాలని, చదివిన చదువు తప్పక ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగ పడుతుందన్నారు. గ్రామంలో ఒక్కరు చదువుకున్నా ... వారు మాత్రమే కాకుండా మొత్తం గ్రామమే బాగుపడుతుందని తెలిపారు. 10 వతరగతి పరీక్షల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కెజిబివిలో 10 వతరగతి విద్యార్థులకు టి ఫైబర్ ద్వారా ఏ.ఐ ల్యాబ్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని గొప్ప స్థాయికి ఎదిగి మన గ్రామానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఎంజీఎంలో మృత శిశువును వదిలి వెళ్ళిన తల్లిదండ్రులు

**వరంగల్ మహా;** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో నెలలు నిండకుండా జన్మించిన మగ మృత శిశువును తల్లిదండ్రులు వదిలేసి వెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 8న తొర్రూరులోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో 7 నెలల గర్భిణి మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంలో అక్కడి వైద్యులు ఎంజీఎం ఆసుపత్రికి రెఫర్ చేశారు. అదేరోజు కుటుంబ సభ్యులు శిశువును ఎంజీఎం పిల్లల వార్డుకు తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు శిశువు అప్పటికే మృతిచెందినట్లు తెలి పారు. దీంతో మృత శిశువును తీసుకెళ్లకుండా వారు మార్చురీలోనే వదిలేసి వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఎంజీఎం ఆసుపత్రి అధికారులు మట్టెవాడ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా వారు విచారణ చేపట్టి వదిలి వెళ్లిన వారికి కాల్ చేశారు. శుక్రవారం వచ్చి మృతశిశువును తీసుకెళ్తామని చెప్పి నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.



## ట్రాఫిక్ హోంగార్డుకు సహోద్యోగుల ఆర్థిక సహాయం

**హన్మకొండ మహా;** హన్మకొండ ట్రాఫిక్ విభాగంలో హోమ్ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ సమీపంలో ఇటీవల అనారోగ్యానికి గురై స్థానిక హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ కొద్ది రోజుల క్రితం మరణించారు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం వైద్య ఖర్చులు అధికమై, ఆర్థికంగా భారం కావడంతో మానవీయ కోణంలో ఆలోచించిన హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతారెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది తమ వంతు సహకారంగా 72వేల రూపాయలు ఫిక్స్ డిపాజిట్ చేసి, ఆ పత్రాలను ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ చేతుల మీదుగా హోంగార్డ్ పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేద హోమ్ గార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ట్రాఫిక్ సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ ఇన్స్ స్పెక్టర్ సీతా రెడ్డి, ఎస్ ఐలు కొమురెల్లి, ఫసియొద్దీన్, విజయ్ కుమార్ తో ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్యా రంగానికి పెద్దపీట

- ప్రైవేట్ కు ధీటుగా విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో నూతనంగా దాతల సహకారంతో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఆడిటోరియం నిర్మాణం చేపట్టగా వీటిని హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్, ఎస్పీ సిహెచ్ రూపేష్ ఐపీఎస్ లతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ పాఠశాల కాలేజీ దాతల సహకారంతో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఆడిటోరియం ప్రారంభానికి విచ్చేసిన దాతలను, కలెక్టర్, ఐపీఎస్, ఎమ్మెల్యే కు శాలువాతో సత్కరించి షీల్డ్ ప్రధానం చేశారు. అంతేకాకుండా కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థినీలకు దాతల సహకారంతో 25వేల రూపాయలు, 10వేల రూపాయలు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని విస్తరించుకునేలా, సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునేలా, సృజనాత్మక ఆలోచనలకు వేదికగా ఈ సదుపాయాలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకొచ్చి సహకరించడం శుభపరిణామమని అభినందించారు. విద్యార్థులు ఈ కొత్త సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ప్రతిభను వెలికితీసుకోవాలని అన్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో కూడిన ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆడిటోరియం వంటివి ఉండటం వలన గ్రామీణ, పట్టణ విద్యార్థులకు కూడా ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దాతల సహకారంతో నిర్మించిన ఈ సదుపాయాలు సమాజం విద్య పై చూపుతున్న ఆసక్తికి నిదర్శనమని విద్యార్థులు కృషి చేసి మంచి ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు గౌరవం తీసుకు రావాలని పిలుపునిచ్చారు.



## కేజీబీవీలో పురుగుల ఆహారం

**ఆదిలాబాద్ మహా:** జిల్లాలోని నార్నూర్ మండల కేంద్రం కేజీబీవీ స్కూల్ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. తమకు పెట్టే అల్పహారం,, అన్నంలో పురుగులు ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. అన్నంలో పురుగులు ఉన్నాయని ఎన్నిసార్లు చెప్పినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇక సమాచారం అందుకున్న ఆదివాసి, లంబాడా సంఘాల నాయకులు పాఠశాలను సందర్శించారు. స్కూల్ విద్యార్థులతో మాట్లాడిన నేతలు... మెను ప్రకారం భోజనం పెట్టడం లేదని గుర్తించారు. ఇక కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇటు విద్యార్థులు అటు ఆదివాసి, లంబాడా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అటు అధికారులు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు.

## వైభవంగా దసరా శరన్నవరాత్ర ఉత్సవ ఏర్పాట్లు

### పరిశీలించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ మహా;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దసరా శరన్నవరాత్ర మహోత్సవముల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్ దేవాలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్ తదితరులున్నారు. తదనంతరం దేవాలయ ధర్మకర్తగా కటకం రాములు తో దేవాలయ కార్యాలయంలో సహాయ కమీషనర్ కార్యాలయ పర్యవేక్షకులు కె. కుమారస్వామి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రామల సునీత కార్యనిర్వహణాధికారి, దేవాలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్, మోతుకూరి మయూరి, రామేశ్వర్రావు, జారతి వెంకటేశ్వర్లు, పాలడుగుల ఆంజనేయులు, ప్రధానార్ధకులు భద్రకాళి శేషు, పర్యవేక్షకులు జి. కాంతికుమార్, సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ఓరియంటల్ ఇన్సూరెన్స్ 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్ మహా;** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ బీమా సంస్థల్లో ఒకటైన ఓరియంటల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 79 వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా వరంగల్ నగరంలోని ములుగు రోడ్డులో గల ఓరియంటల్ ఇన్సూరెన్స్ హనుమకొండ బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గత 7 దశాబ్దాలుగా భారతదేశంలో భీమా రంగంలో సేవలందిస్తూ పాలసీదారుల మన్ననలను పొందుతున్న ఓరియంటల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 79వ వసంతంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని అన్నారు. ఇన్ని సంవత్సరాల సుదీర్ఘ విజయ ప్రయాణానికి కారణమైన సహ ఉద్యోగులకు, ఏజెంట్లకు, పాలసీదారులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారాన్ని అందిస్తూ కంపెనీ ఎదుగుదలలో పాలుపంచుకోవాలని కస్టమర్లను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్యాచ్ మేనేజర్ కొల్లూరు రాజు తోపాటు అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ భార్గవ్, ఆఫీసర్ శ్రీనివాస్, క్యాషియర్ రాజేంద్రప్రసాద్, కార్యాలయ సిబ్బంది, 50 మంది ఏజెంట్ల తో పాటు పాలసీదారులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న ప్రింట్ మీడియా హవా

### డిజిటల్ యుగంలోనూ దినపత్రికల జోరు

**వరంగల్ మహా;** ప్రస్తుత కాలంలో డిజిటల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లోనూ దినపత్రికలు తమ ప్రాభవాన్ని కోల్పోలేదని మరోసారి రుజువైంది. దేశంలో వార్తాపత్రికల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని, పాఠకుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్కులేషన్స్ (ఏబీసీ) విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. విశ్వసనీయమైన, లోతైన సమాచారం కోసం ప్రజలు ఇప్పటికీ పత్రికలనే ఆశ్రయిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా దినపత్రికల సర్కులేషన్ పై ఏబీసీ ఆడిట్ నిర్వహించింది. ఈ ఆరు నెలల్లో మొత్తం 2,97,44,148 కాపీలు అమ్ముడైనట్లు ఏబీసీ తన ప్రకటనలో వెల్లడించింది. గత ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన 2,89,41,876 కాపీలతో పోలిస్తే ఇది 2.77 శాతం అధికమని పేర్కొంది. అంటే, కేవలం ఏడాది వ్యవధిలోనే 8,02,272 అదనపు కాపీల అమ్మకాలు జరిగాయి. ఈ వృద్ధికి ప్రధాన కారణం పత్రికల పై ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకమేనని ఏబీసీ అభిప్రాయపడింది. ధ్రువీకరించిన, నిఖార్సయిన వార్తల కోసం పాఠకులు దినపత్రికలనే ఎంచుకుంటున్నారని తెలిపింది. వార్తాపత్రికలు ఇప్పటికీ అత్యంత శక్తిమంతమైన ప్రసార మాధ్యమంగా కొనసాగుతున్నాయనడానికి ఈ సర్కులేషన్ పెరుగుదలే నిదర్శనమని ఏబీసీ విశ్లేషించింది. ఈ ఆరోగ్యకరమైన పురోగతి ప్రింట్ మీడియా పరిశ్రమకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తోందని నిపుణులు అంటున్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేతను పరామర్శించిన బిజెపి రాష్ట్ర నాయకులు



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి అయూబ్ మాతృమూర్తి ఇటీవల మరణించగా శుక్రవారం బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు వారి నివాసానికి వెళ్లి అయూబ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తూర్పు నియోజకవర్గం లోని ఇటీవల మరణించిన వ్యక్తుల కుటుంబాలను ఎర్రబెల్లి ప్రదీప్ రావు స్వయంగా పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మార్టిన్ లూథర్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా అధికార ప్రతినిధి రత్నం కృష్ణ కిషోర్, జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ నెంబర్ కోమాకుల నాగరాజు, జర్నలిస్టు అమీర్, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.




## బాల్యవివాహాలు నిర్మూలించాలి

**ఆదిలాబాద్ మహా :** బాల్య వివాహాలు వద్దంటూ ష్యూర్ ఎన్జీవో సంస్థ అవగాహన కల్పించింది. బాల్య వివాహాలను నిర్మూలించడానికి తమ పూర్తి సహకారం ఉంటుందని మమ్మదియా మత పెద్ద మజీద్ మౌలానా అబ్దుల్ అజీమ్ అసది, సిడబ్ల్యుసి కమిటీ సభ్యుడు సమీరుల్లా ఖాన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానం వద్దగల మసీదులో శుక్రవారం ష్యూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా బాల్యానికి అతి పెద్ద ముప్పు బాల్య వివాహం అన్నారు. ప్రతి నెలా పది లక్షల మంది పిల్లలు ఇప్పటికీ యుక్త వయస్సు రాకముందే పెళ్లి చేసుకుంటున్నారు.బాల్య వివాహాలను అంతం చేయడం నేడు అతిపెద్ద సామాజిక నైతిక బాధ్యత అని గుర్తు చేశారు.గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ పేరిట 3రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. యువతులకు 18, యువకులకు 21 ఏళ్ల వయసు వచ్చేవరకు పెళ్లి గురించి ఆలోచించవద్దని తెలిపారు. అలాచేస్తే చట్టప్రకారం నేరమని కూడా అన్నారు. అంతే కాకుండా ప్రభుత్వఉద్యోగాలు కాని సంక్షేమ పథకాలు కాని వారికి వర్తించవన్నారు. కొందరు తప్పుడు ధృవీకరణ పత్రాలతో ఈ నిబంధనను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అది సరైంది కాదని అవగాహన కల్పించారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పెళ్లిళ్లు జరిగితే 1098 కి సమాచారమివ్వాలని కోరారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్న ష్యూర్ ఎన్జీవో సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు మొహమ్మద్ జాహిద్, అఫ్రోజ్ ఖాన్, సాజి తోద్దీన్, మహమ్మద్ సలీం, అవేస్, అమీన్ షరీఫ్ , ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె వినోద్, ఫీల్డ్ సూపర్వైజర్ సంపత్ కిరణ్, చైల్డ్ లైన్ సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

### సిబ్బందిని అభినందించిన వరంగల్ పోలీస్ కమిషనర్

**హన్మకొండ మహా;** హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 జరిగిన జరిగిన హత్య కేసులో నిందితుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల ప్రాంతానికి చెందిన పాలత్య రమేష్ కు జీవిత ఖైదు తో పాటు వేయి రూపాయల జరిమానా ను విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి. అపర్ణ దేవి శుక్రవారం సంచలన తీర్పు నిచ్చారు. వివరాల్లోకి వెళితే శిక్షకు గురైన నిందితుడు రమేష్, మృతుడు యంజాల శివ ఇరువురు స్నేహితులు కావడంతో పాటు ఇరువురు కలిసి చిల్లర దొంగ తానాలకు పాల్పడంతో పాటు, రోజువారి కూలీ పనులు చేయగా వచ్చే డబ్బును ఇరువురు సమానం పంచుకొనేవారు. ఇదే సమయం లో వీరి ఇరువురి మధ్య తరుచుగా గొడవలు జరిగేవి. 2023 సెప్టెంబర్ 11 తారీఖున నిందితుడికి మృతుడి మరోమారు గొడవలు జరగడంతో ఎలాగైనా మృతుడు శివ చంపాలనుకున్న నిందితుడు అదే రోజు రాత్రి అశోక జంక్షన్ లోని యూనియన్ బ్యాంక్ భవనం పై మృతుడు శివను నిందితుడు రమేష్ కర్రతో తీవ్రంగా కొట్టి భవనం పై నుండి తోసి నిందితుడు శివను దారుణం హత్య చేసాడు. ఈ సంఘటనలో కేసు నమోదు చేసుకున్న హన్మకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టి కచ్చితమైన సాక్షాదారాలు, చార్జిషీటు తో పాటు సాక్షులను సరైన సమయంలో కోర్టులు హాజరుపరచడంతో నిందితుడికి జీవితఖైదు శిక్ష విధించడం జరిగింది.

## పిడుగు పడి లెక్కలగడ్డ వద్ద 94 గొర్రెల మృతి

**కాటారం, మహా :** మహాదేవపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామ శివారు లో గోదావరి నది వద్ద గురువారం అర్ధరాత్రి మెరుపు లతో కూడిన భారీ వర్షానికి పిడుగు పడి 94 గొర్రెలు మృతి చెందాయి. అంబటిపల్లి గ్రామానికీ చెందిన 6 రైతులు గొర్రెలు పిడుగు పటుకు 94 మరణించడం కాత్రేవుల కత్తెరశాల 21 గొర్రెలు, కాత్రేవుల కళ్యాణ్ 17 గొర్రెలు, కాత్రేవుల ఆదిరెడ్డి 20 గొర్రెలు,కాత్రేవుల మల్లేష్ 10 గొర్రెలు,5కాత్రేవుల పున్నంచెందర్ 15 గొర్రెలు కాత్రేవుల శ్రీశైలం 11 గొర్రెలు మరణించాయి.సంఘటన స్థలానికి జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి, మండల అధికారి బి రాజబాబు, తహసిల్దార్ రామారావు, సందర్శించి గొర్రెల కు సంఘటన స్థలంలో పోస్ట్ మార్టం, పంచినామా నిర్వహించారు. జెసిబి ద్వారా గోతి తీసి మరణించిన గొర్రెలను ఖననం చేశారు సుమారు. పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందడం ద్వారా 10 లక్షలు నష్టం వాటిల్లినట్లు గొర్రె కాపర్లు ఆవేదనతో తెలిపారు. గొర్రెల ద్వారానే తమ జీవనోపాధి కలుగుతుందని అవి మరణించడంతో తాము వీధిన పడ్డామని ప్రభుత్వాను సహాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### ఆశయాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో

# సాధించడం అభినందనీయం

### బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



**బెల్లంపల్లి, మహా :** విద్యార్థి స్థాయి నుండి ఉన్నత ఆశయన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించడం అభినందనీయమని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల, బాలుర వసతి గృహంలో గతంలో విద్యను అభ్యసించి ప్రభుత్వఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల, సంక్షేమ వసతి గృహంలో విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థులు చిన్నతనంలోనే ఆశయాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ప్రయత్నించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కళాశాల సమయంలో ఉన్నత ఉద్యోగాలలో పని చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులను పూర్తిగా తీసుకోవాలని తెలిపారు. పూర్వ విద్యార్థులైన సన్మాన గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించాలని తెలిపారు.అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు జి.విలాస్ (టీచర్), సిహెచ్.రాజన్న (కానిస్టేబుల్ ),జి. ప్రదీప్ (కానిస్టేబుల్ ), జి. వెంకట స్వామి (కానిస్టేబుల్), డి శ్రీకాంత్ (కానిస్టేబుల్), సిహెచ్. శ్రీనివాస్ (కానిస్టేబుల్), డి.సుగుణాకర్ (జూనియర్ అసిస్టెంట్), వి.వికాస్ (జూనియర్ లైన్మెన్), ఏ.సాయి కృష్ణ (జూనియర్ లైన్మెన్) లనుసత్కరించారు.ఈ కార్యక్రమంలో వసతిగృహసంక్షేమ అధికారి జి. వెంకటేశం, వసతి గృహ సంక్షేమ అధికారిని సరిత, వసతి గృహ అధికారులు శ్రీనివాస్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి మహా:** బెల్లంపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు.శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదులు, పాఠశాలలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, డి.ఈ. యు.యు.ఐ.డి.సి. ఎ.ఈ. వినయ్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాల లను అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులతోమాట్లాడి పాఠశాలలో వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం అయినందున విద్యార్థులకు ఎలాంటి సీజనల్ వ్యాధులు, ఎలర్జీ ఇతర లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం,శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన తయారీ సమయంలో తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని, వంట సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు,తరగతి గదులు, వంటశాల ప్రాంతాలలో పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రామ్ నగర్ ప్రాంతంలో చేపట్టిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో యువతకు 20 శాతం సీట్లు కేటాయించాలి

### యూత్ కాంగ్రెస్ నాయకులు

**ఆదిలాబాద్ మహా :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు 20 శాతం సీట్లు కేటాయించాలని ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి రెడ్డి అన్నారు. శుక్రవారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి ఆడే గజేందర్ కు యువ నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆడే గజేందర్ సానుకూలంగా స్పందిస్తూ.. యువకులకు పెద్ద పీట వేస్తామన్ని, స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పిస్తామని అన్నారు. యువతకు ప్రాధాన్యత ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఆడే సతీష్ నాయక్, యండి సద్దాం, తుల అజయ్, అజీమ్ సుల్తాన్, చెట్లపల్లి అనిల్, గజ్జెల అశోక్, సింగారపు స్వామి తదితరులు పాల్గొన్నారు

## బియ్యం నిల్వ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### ముక్కిన బియ్యం నిల్వలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

**వరంగల్ మహా;** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఏనుమాములలో ఉన్న బియ్యం నిల్వ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కేంద్రంలో నిల్వ ఉన్న బియ్యం నాణ్యత, నిల్వ విధానం, భద్రతా ఏర్పాట్లు, రికార్డు నిర్వహణను పరిశీలించారు. ముక్కిన బియ్యం, విద్యార్థులకు సరఫరా చేసే మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఒకే చోట నిల్వ ఉండడాన్ని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పౌరసరఫరాల డిఎం, ఎం ఎల్ ఎస్ పాయింట్ ఇంచార్జి కు శ్రీముఖాలు జారీ చేయాలని అదనపు కలెక్టర్ ను ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడ్డ బియ్యాన్ని వెంటనే వేలం వేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కలెక్టర్ వెంట ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ ఇక్బాల్, ఎను మాముల ఇన్స్పెక్టర్ జె సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వరంగల్, మహా;** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంల) ను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శుక్రవారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హైకోర్టు ఉత్తర్వుల ననుసరించి ఎన్ని




కల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలను భద్రపర్చిన గోదాం ను కూడా పరిశీలించి, జిల్లా వేర్ హౌజ్ కు తరలించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, రమాదేవి, తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి ఎస్ పి నుండి అనిల్, టిడిపి నుండి శ్యామ్, ఏ ఐ ఎం ఐ ఎం నుండి ఫైజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై దాడికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

### పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్

12/09/2025 వ తేదీ మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎంఎన్ఆర్ నగర్ వద్ద బుడిగ జంగాల కాలనీకి చెందిన వ్యక్తులు రెండు వర్గాలుగా ఏర్పడిగొడవ పడుతున్నారనే సమాచారం రాగా మడికొండ ఎస్సై రాజ్ కుమార్ అతని సిబ్బందీని తీసుకొని అక్కడకు వెళ్లి గొడవ ఆపుటకు ప్రయత్నించారు. కాగా అక్కడ గొడవ పడుతున్న తూర్పటి విజయ్ అనే అతడు అడ్డ తిరిగి మీరెవరు ఇక్కడకు రావడానికి ఇవాళ వాళ్ళని చంపుతానని బెదిరిస్తూ నువ్వెందుకు వచ్చావని పోలీస్ వారిని ఇష్టం వచ్చినట్టుగా బూతులు తిడతూ గల్ల పట్టుకుని మీరేం చేస్తరురా అంటూ అసభ్యకరంగా ఇష్టం వచ్చినట్టుగా చేతులతో కొడుతూ గొడవ చేసి పోలీస్ వారి విధులను అడ్డుకున్నాడు. ఈ విషయం పై ఎస్సై రాజ్ కుమార్ దరఖాస్తూ ఇవ్వగా మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ అతడి పై కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగింది. గొడవలు జరగకుండా ఆపడం పోలీసుల ప్రధాన కర్తవ్యం అలా ఆపడానికి వచ్చిన పోలీస్ వారిమీద భౌతిక దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## యూరియా కోసం జాతీయ రహదారిపై రైతుల ధర్నా

### రైతుల తిప్పలు పట్టించుకోని ప్రజా ప్రభుత్వం.. రైతన్నలకు అండగా నిలిచిన మాజీ మంత్రి ఎర్రబెల్లి అరెస్టు, విడుదల

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పై రైతన్నల ధర్నాలో ప్రభుత్వం వెంటనే రైతుల యూరియా కష్టాలు లేకుండా చేయాలని వారికి మద్దతుగా నిలిచిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు యూరియా సరఫరా, సరిపడా ఎరువుల విక్రయాలు , గోదాములలో నిలువ చేయలేక ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి 420 దొంగ హామీలతో ప్రభుత్వంలోకి వచ్చి రైతులను అరిగోస పెడుతున్నాడని గత నెల రోజుల నుండి 5 10 ఎకరాల రైతన్నలకు ఒకటి ,రెండు యూరియా బస్తాలు ఇస్తే పంటలను ఏవిధంగా పండిస్తారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని అన్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి సిగ్గు తెచ్చుకొని రైతన్నలకు మేలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో కేసిఆర్ తెచ్చిన పథకాలను అమలు చేయాల్సిందే అని డిమాండ్ చేశారు. హన్మకొండ వరంగల్ జిల్లాల్లో రైతులు ఎరువుల కోసం అరిగోసలు పడుతుంటే పలుమార్లు కలెక్టర్లతో , వ్యవసాయ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి ఈ ఎరువుల కొరతను నియంత్రించండి దయచేసి రైతులను ఇబ్బంది పెట్టకుండా సరిపడా ఎరువులను అందించాలని చాలా సార్లు మాట్లాడినా కూడా యూరియా రాకపోవటంతో రైతులు చేస్తున్న ధర్నాకి మద్దతుగా వస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని జిల్లాలో రైతులకు సరిపడా ఎరువు బస్తాలను అందించేవరకు ఈ ఆందోళనలు ఆగవని అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులతో కలిసి ఇంటిని ముట్టడించి ధర్నా చేయడానికైన వెనకాడబోమని ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు.



## కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త

### కిషన్ రెడ్డి కీలక ప్రకటన

**రాంచీ, మహా :** బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కోల్ ఇండియాలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ప్రయోజనాలు కల్పిస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం కీలక ప్రకటన చేశారు. ఇందులో భాగంగా రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా కవరేజీతో పాటు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా కార్మికులు, అధికారులందరికీ ఒకేరకమైన డ్రెస్ కోడ్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాంచీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ పూజను పురస్కరించుకుని ఈ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఈ కొత్త పథకాలు అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, కోల్ ఇండియాలోని రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా లభిస్తుందని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 40 లక్షల వరకు బీమా వర్తిస్తుందని వివరించారు. దీంతో పాటు, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగులకు గౌరవప్రదమైన గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో దేశంలోని అన్ని బొగ్గు గనుల్లో ఒకేరకమైన డ్రెస్ కోడ్ తీసుకువస్తున్నామని



కిషన్ రెడ్డి అన్నారు. ఈ యూనిఫామ్‌లను కోల్ ఇండియా సంస్థే అందిస్తుందని, ఇది అధికారులకు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. దేశంలో బొగ్గు ఉత్పత్తి మొదటిసారిగా ఒక బిలియన్ టన్నులు దాటిందని, దిగుమతులు తగ్గించుకోవడం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ. 60,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశామని చెప్పారు. ప్రభుత్వం కేవలం బొగ్గుపైనే కాకుండా, కీలక ఖనిజాల అన్వేషణపై కూడా దృష్టి సారించిందని, ఇందుకోసం రూ. 32,000 కోట్లతో 'నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. దేశంలో 74 శాతం విద్యుత్ థర్మల్ పవర్ నుంచే ఉత్పత్తి అవుతున్నందున, ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## అట్టహాసంగా ప్రారంభమైన కేరళ అర్బన్ కాన్ క్లేవ్- 2025 సదస్సు

### కేరళ రాష్ట్ర మంత్రులతో కలిసి పాల్గొన్న నగర మేయర్

**వరంగల్ మహా;** కేరళ అర్బన్ పాలసీ 2025 50లో భాగంగా నగరాలు, అభివృద్ధి చెందుతున్న సమాజాలు అనే అంశంపై కేరళ రాష్ట్రం తొలి సారి అర్బన్ కాన్ క్లేవ్ 2025 పేరు తో ఏర్పాటు చేసిన సదస్సు శుక్రవారం కొచ్చి లోని బోల్గట్టిలోని గ్రాండ్ హయత్ లో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో కేరళ రాష్ట్ర పరిశ్రమలు న్యాయశాఖ మంత్రి రాజీవ్, కేరళ స్థానిక సుపరిపాలన సంస్థలు, ఎక్సైజ్ శాఖ మంత్రి రాజేష్, కేరళ ఆర్థిక శాఖ మంత్రి కే. ఎన్.బాలగోపాల్ లతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు.



సదస్సు రెండవ రోజు శనివారం నిర్వహించే కార్యక్రమంలో మేయర్ గ్రేటర్ వరంగల్ నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించనున్నారు.

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత

### కార్పొరేటర్ మరుపల్ల రవి

**వరంగల్ మహా;** ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజల పై ఉందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ప్రభుత్వం తలపెట్టిన డ్రైడే కార్యక్రమంలో భాగంగా మలేరియా హెల్త్ అసిస్టెంట్ పి బాబు ఆధ్వర్యంలో కార్పొరేటర్ మరుపల్ల రవి కార్యక్రమంలో హాజరై ప్రగతి నగర్ లో ఉన్న నీరు నిల్వ ఉన్న గుంతలలో ఆయిల్ బాల్స్ ను వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటిలోని అక్కరకు రాని వస్తువులలో నీరు నిలువ ఉండటం వలన దోమలు పుట్టుక వచ్చి ప్రజలకు హాని తలపెట్టుతుందని అన్నారు. డివిజన్లో అనేకమంది ప్రజలు జ్వరాలు, దగ్గు జలుబు, డెంగ్యూ టైఫాయిడ్ మలేరియా వ్యాధులతో బాధపడుతున్నారనీ



ఇంటిలోని చెత్తాచెదారాన్ని నిల్వ ఉంచుకోకుండా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. కొందరు నిర్లక్ష్యంగా డ్రైనేజీలలో చెత్తాచెదారం వేయడం వలన డ్రైనేజీ నీరు బయటికి పోకుండా ఉండి ఆ మురుగు నీరునిల్వ ఉండటం వల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసన తో పాటు దోమలు పుట్టుకొస్తున్నాయన్నారు.

## కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త

### కిషన్ రెడ్డి కీలక ప్రకటన

**రాంచీ, మహా :** బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కోల్ ఇండియాలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ప్రయోజనాలు కల్పిస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం కీలక ప్రకటన చేశారు. ఇందులో భాగంగా రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా కవరేజీతో పాటు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా కార్మికులు, అధికారులందరికీ ఒకేరకమైన డ్రెస్ కోడ్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాంచీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ పూజను పురస్కరించుకుని ఈ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఈ కొత్త పథకాలు అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, కోల్ ఇండియాలోని రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా లభిస్తుందని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 40 లక్షల వరకు బీమా వర్తిస్తుందని వివరించారు. దీంతో పాటు, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగులకు గౌరవప్రదమైన గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో దేశంలోని అన్ని బొగ్గు గనుల్లో ఒకేరకమైన డ్రెస్ కోడ్ తీసుకువస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఈ యూనిఫామ్‌లను కోల్ ఇండియా సంస్థే అందిస్తుందని, ఇది అధికారులకు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. దేశంలో బొగ్గు ఉత్పత్తి మొదటిసారిగా ఒక బిలియన్ టన్నులు దాటిందని, దిగుమతులు తగ్గించుకోవడం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ. 60,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశామని చెప్పారు. ప్రభుత్వం కేవలం బొగ్గుపైనే కాకుండా, కీలక ఖనిజాల అన్వేషణపై కూడా దృష్టి సారించిందని, ఇందుకోసం రూ. 32,000 కోట్లతో 'నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. దేశంలో 74 శాతం విద్యుత్ థర్మల్ పవర్ నుంచే ఉత్పత్తి అవుతున్నందున, ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## సికెఎం కళాశాలలో డిగ్రీ స్పాట్ ప్రవేశాలు

**వరంగల్ మహా;** వరంగల్ నగరం దేశాయిపేట లోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో బి ఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మిగిలి పోయిన సీట్లను భర్తీ చేసేందుకు సెప్టెంబర్ 15, 16 తేదీలలో స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ ధర్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు దోస్త్ వెబ్సైట్ తో పాటు కళాశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ టి సి తో పాటు ఇతర ధ్రువపత్రాలు తీసుకొని స్పాట్ కౌన్సిలింగ్ హాజరు కావాలని కోరారు. ధృవ పత్రాలు పరిశీలించాక అర్హులైన వారికి మాత్రమే సీట్లు కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం కళాశాలను సంప్రదించాలని కోరారు.




## ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని అల్టిమేటం
- దాదాపు 10లక్షల మంది విద్యార్థులపై బంద్ ప్రభావం

**హైదరాబాద్, మహా:** ఈ నెల 15 నుంచి వృత్తి విద్యా కళాశాలల నిరవధిక బంద్ చేస్తామని తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల ఫెడరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, ఫార్మా కళాశాలలు బంద్‌లో పాల్గొంటాయని ఫెడరేషన్ నాయకులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈమేరకు బంద్‌పై ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశామని ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. దాదాపు 10లక్షల మంది విద్యార్థులపై బంద్ ప్రభావం పడుతుందన్నారు.

**ఇంజనీర్స్ డేను బ్లాక్‌డేగా పాటిస్తాం..**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో.. ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అన్ని కాలేజీలను నిరవధికంగా బంద్ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి నోటీసు అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయనందుకు నిరసనగా ఇంజినీర్స్ డేను బ్లాక్‌డేగా పాటిస్తామని ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు ప్రకటించాయి.

## కాటారం సబ్ డివిజన్‌లో టీచర్ల అక్రమ డిప్యూటేషన్లు

### అక్రమ డిప్యూటేషన్లను ప్రోత్సాహిస్తున్న డిఇఓ ను సస్పెండ్ చేయాలి.. ప్రజాసంఘాలు డిమాండ్

**కాటారం, మహా :** కాటారం సబ్ డివిజన్లో టీచర్లను విద్యాశాఖ కార్యాలయంలో నియమించవద్దని ప్రభుత్వం మార్గదర్శకాలు ఉన్నప్పటికీ డీఈఓ రాజేందర్ అక్రమ డిప్యూటీ కందు చేశారని జిల్లా ప్రజా సంఘాలు ఆరోపించాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో శుక్రవారం పత్రిక విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి కార్యాలయం లో ఈ మధ్య లో చేపట్టిన వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో అక్రమ డిప్యుటేషన్స్ రద్దు చేయాలనీ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. 2024 లో విద్యాశాఖ డైరెక్టరేట్ మార్గదర్శకాలను అనుసరించి ఏ ఒక్క టీచర్ ను కూడా జిల్లా విద్యాశాఖ లో నియమించరాదనీ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆ మార్గదర్శకాలను డిఇఓ యం. రాజేందర్ తుంగలో తొక్కి విద్యాశాఖ కార్యాలయం లో CMO, AMO, GCDO, DCEB, డిప్యూటీ సెక్రటరీ లతో పాటు ACGE, అసిస్టెంట్ సెక్రటరీ లను నియమించారని పేర్కొన్నారు. ఈ పోస్టులో నియమించాలంటే SSA (సర్వశిక్ష అభియాన్) నిర్వహించే పరీక్ష లో ఉత్తీర్ణులైన వారు అర్హులనీ, అదికూడా మూడు సంవత్సరాల వరకే పరిమితి ఉంటుందని, కానీ వీరు ఒక్కొక్కరు నాలుగు సంవత్సరాలనుండి పని చస్తున్నారని తెలిపారు. అదే విదంగా మొన్న జరిగిన వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో లో పాయికారి ఒప్పందం తో మహాముత్తారం మండలం కొర్లకుంట MPUPS నుండి స్కూల్ అసిస్టెంట్ (మ్యాత్స్) టీచర్ ను జిల్లా విద్యాధికారి కార్యాలయం లో వర్క్ అడ్జస్ట్మెంట్ పేరు తో అక్కడే ఉంటున్నారు. వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో 2024 మార్గదర్శకాలకు విరుద్ధంగా మల్హర్ మండలం UPS కొండంపేట నుండి ఒక టీచర్ ను కాటారం మండలం MPPS మేడిపల్లి కి అడ్జెస్ట్ చేశారు. అలాగే MPPS మేడిపల్లి నుండి ఒక టీచర్ ను మళ్ళీ మల్హర్ మండలం MPPS తాడిచెర్ల ఎస్సి కాలనీకి అడ్జెస్ట్ చేశారు. మహాముత్తారం మండలం MPPS కిష్టాపూర్ నుండి ఒక టీచర్ ను టేకుమట్ల మండలం MPPS సోమన్ పల్లి కి అడ్జెస్ట్



చేశారు. కానీ మహాముత్తారం, మల్హర్ మండలాల్లో ఇంకా ఉపాధ్యాయులు అవసరం ఉన్నప్పటికీ ఈ రెండు మండలాలు దాటి టీచర్స్ పంపించడం లో ఆంతర్యం ఏమిటనీ ప్రశ్నించారు. ఒక టీచర్ ను అడ్జస్ట్మెంట్ చేయాలంటే దగ్గర లో గల స్కూల్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. అలా లేకపోతే దూరప్రాంతాలకు అడ్జెస్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మల్హర్ మండలం వల్లెంకుంట నుండి MPPS ఎడ్లపల్లికి ఒక టీచర్ ను సర్ధుబాటు చేస్తూ MPPS తాడిచెర్ల కు మరొక టీచర్ ను అడ్జెస్ట్ చేశారని తెలిపారు. ఈ విధంగా తప్పుడు పద్ధతి లో అడ్జెస్ట్ చేస్తున్న క్రమంలో పారదర్శకత పాటించాలనీ ప్రజాసంఘాలు గా మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ వర్క్ అడ్జస్ట్మెంట్ సందర్బంగా ఒక లిస్ట్ తయారు చేసి కార్యాలయం నోటీసు బోర్డు పై అంటించాలి. అలాకాకుండా రహస్య పద్ధతి లో వ్యక్తిగతంగా ఆర్డర్స్ ను వారి వారి సెల్ ఫోన్ వాట్సాప్ కు పంపించి ఒత్తిడి చేస్తున్నారనీ పేర్కొన్నారు. ఈ మద్యకాలంలో జిల్లా లో కెజీబివి పాఠశాలల్లో కొన్ని పోస్టులను నింపాలని, వాటిని మేము ప్రాదిపధకన నింపాలని కోరుతున్నాము. జిల్లా లో ఇప్పుడు ఉన్నత పాఠశాలలకు ప్రమోషన్ సందర్భంగా PGHMలు నియమించబడ్డారు కనుక మహాముత్తారం మండలంలోని సీనియర్ PGHM ను మండల విద్యాధికారిగా నియమించాలి. కొసమెరుపు కాటారం మండలం MPUPS అంకుసాపూర్ లో మంజూరు అయినా టీచర్ పోస్టులు తొమ్మిది. అందులో ఎనిమిది మంది టీచర్ లు జాయిన్ అయినారు. ఈ స్కూల్ అప్ గ్రేడ్ చేశారు. ఇందులో ఎనిమిది తరగతులు, 65 మంది పిల్లలు ఉన్నారు. కానీ ఇటీవల జరిగిన ప్రమోషన్ లో ఈ పాఠశాల కు ఇంగ్లీష్ టీచర్ ను నియమించలేదు, పైగా ఈ పాఠశాలలో పని చేస్తున్న హిందీ స్కూల్ అసిస్టెంట్ ను డిప్యూటేషన్ పేరు తో మల్హర్ మండలం రుద్రారం హైస్కూల్ కు అడ్జెస్ట్ చేశారు. ఒక పక్క ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టి, ఎఐ ల్యాబ్ ఇచ్చామనీ గొప్పలు చెబుతుంది, కానీ ఉన్నఫలంగా సబ్జెక్టు టీచర్స్ ను వేరే స్కూల్ కు అడ్జెస్ట్ చేయడం లో ఆంతర్యం ఏమిటని ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఉన్న కొద్ది మంది టీచర్స్ ను తాత్కాలిక వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో నెలలో ఇద్దరు, ముగ్గురు టీచర్లను వేరే స్కూల్ కు పంపుతూ అంకుసాపూర్ పాఠశాల లో పిల్లలను నాణ్యమైన విద్య కు దూరం చేస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారని, వెంటనే వర్క్ అడ్జెస్ట్ పేరు తో టీచర్ లను ఇబ్బంది పెట్టకుండా, ఇంగ్లీష్, హిందీ టీచర్ లను పూర్తి స్థాయిలో అలాట్ చేసి పిల్లలకు నాణ్యమైన విద్యబోధన జరిగే విధంగా సంబందిత అధికారులు చూడాలనీ ప్రజాసంఘాలు, డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్కూల్ ను మూసేసి ఉన్న టీచర్స్ ను ఇంటికి పంపిస్తే, మా పిల్లల్ని వేరే పాఠశాల కు పంపించుకుంటామని గ్రామప్రజలు మండిపడ్డారు.

## అడిషనల్ కమిషనర్ ను కలిసిన వార్డ్ ఆఫీసర్లు

**వరంగల్ మహా;** జిడబ్ల్యుఎంసి లో వార్డ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న 26 మంది మాజీ వీఆర్వో వీఆర్ఏ లను ప్రభుత్వం గ్రామ ఆయా వార్డ్ ఆఫీసర్లుగా గతంలో నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వృత్తిపరమైన కాలం ముగిసినందున వారిని 11092025 శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిడబ్ల్యుఎంసి నుండి రిలీవ్ చేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు బల్దియా అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం అదనపు కమిషనర్ వారికి అభినందనలు తెలుపుతూ ఉద్యోగరీత్యా ఎటువంటి సందేహాలు ఉన్న తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చునని తెలిపారు.



## కామారెడ్డి బీసీ సభ వాయిదా

### వర్ష సూచన కారణంగా విజయోత్సవ సభ పోస్ట్‌పోన్

లక్ష మందికిపైగా జన సమీకరణతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సన్నాహాలు

తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని త్వరలోనే తెలియజేస్తామన్న పీసీసీ

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను వాయిదా వేస్తున్నట్లుగా టీపీసీసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారీ వర్ష సూచన కారణంగా ఈ సభను వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని త్వరలోనే తెలియజేస్తామని పీసీసీ తెలిపింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాల మద్దతు కూడగట్టుకోవాలనే వ్యూహంతో కాంగ్రెస్ పార్టీ ఈనెల 15న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ నిర్వహణకు నిర్ణయించింది. లక్ష మందికిపైగా జన సమీకరణతో ప్రతిష్ఠాత్మకంగా సభ నిర్వహించాలని సన్నాహాలు చేపట్టింది. సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలను ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం భావించింది. ఈ సభా వేదిక నుంచే స్థానిక సంస్థల ఎన్నికలకు సమరభేరీ మ్రోగించాలనుకుంది. పీసీసీ అధ్యక్షుడు సహా మంత్రులు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇంతలోనే భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి సభను వాయిదా వేస్తున్నట్లుగా టీపీసీసీ ప్రకటించింది.

# అభిమానికి ఓ సలహా!

ఓ వైపు సినిమాలతో, మరోవైపు సోషల్ మీడియాతో బిజీగా గడిపేస్తుంటుంది అందాలభామ శ్రీలీల. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో నటిస్తున్న ఈ తెలుగమ్మాయి రీసెంట్‌గా తన ఇన్‌స్టాలో అభిమానులతో చాట్ సెషన్‌ని నిర్వహించింది. అందులో ఓ అభిమాని పెట్టిన మెసేజ్ హైలైట్‌గా నిలిచింది. 'ప్రస్తుతం నేను నిరుత్సాహంగా ఉన్నాను. మనసేం బాలేదు' అని ఆ అభిమాని పెట్టిన మెసేజ్‌పై శ్రీలీల స్పందించింది. 'ఈ విషయంలో నీకు హెల్ప్ చేయగలనో లేదో తెలీదు కానీ... ఓ సలహా మాత్రం ఇస్తా. నేరుగా వెళ్లి మీ కుటుంబంలో మీకు బాగా ఇష్టమైన వ్యక్తిని గట్టిగా హగ్ చేసుకో. నా మనసు బాగుండకపోతే నేను అదే చేస్తా.' అంటూ సలహా ఇచ్చేశారు శ్రీలీల. అభిమాని బాధపై ఆమె స్పందించిన తీరుని చూసిన వారంతా శ్రీలీలను అభినందనలతో ముంచెత్తుతున్నారు.







# బాహుబలి తర్వాత ఈ సినిమానే..

## రాం గోపాల్ వర్మ ట్వీట్

తేజ సజ్జా హీరోగా వచ్చిన లేటెస్ట్ పాన్ ఇండియా చిత్రం మిరాయ్. కార్తీక్ ఘట్టమనేని డైరక్షన్‌లో వచ్చిన ఈ సినిమా ఇవాళే థియేటర్లలో విడుదలైంది. మంచు మనోజ్ విలన్ పాత్రలో కనిపించిన ఈ చిత్రంపై రిలీజ్‌కు ముందే భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఫ్యాన్స్ ఊహించినట్లుగానే మొదటి షో నుంచే మిరాయ్‌కు పాజిటివ్ టాక్ వస్తోంది. తేజ సజ్జా ఖాతాలో హనుమాన్ లాంటి సూపర్ హిట్ ఖాయమని అంటున్నారు. ఈ నేపథ్యంలో టాలీవుడ్ సంచలన డైరెక్టర్ రాం గోపాల్ వర్మ ఆసక్తికర ట్వీట్ చేశారు. మిరాయ్ లాంటి బిగ్ హిట్ అందించిన తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని, టీజీ విశ్వప్రసాద్‌కు కంగ్రాట్స్ తెలిపారు. బాహుబలి తర్వాత ఏ సినిమాకు ఇంత ఏకపక్షంగా ప్రశంసలు రాలేదని పోస్ట్ చేశారు. వీఎఫ్ఎక్స్‌తో పాటు కథనం కూడా.. రెండు హాలీవుడ్ రేంజ్‌లో ఉన్నాయని ఆర్జీవీ కొనియాడారు. ఇది చూసిన టాలీవుడ్ సినీ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఒకటి, రెండు కాదు 8 మూవీస్..

ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. హీరోలతో పాటు హీరోయిన్లు కూడా చాలా తక్కువగానే సినిమాలు చేస్తున్నారు. ఉన్నంతలో రష్మిక పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అయితే ఈమె కంటే బిజీగా ఉన్న మరో బ్యూటీ ఉంది. ఆమెనే మలయాళ బ్యూటీ సంయుక్త. దాదాపు ఏడాదిన్నరగా ఈమె నుంచి కొత్త మూవీ అప్డేట్ అనేదే లేదు. అలాంటిది ఇప్పుడు ఈమె చేతిలో ఏకంగా 8 మూవీస్ ఉండటం విశేషం. ఇంతకీ అవేంటి? వాటి సంగతేంటి? 2016 నుంచి మలయాళంలో సినిమాలు చేస్తున్న సంయుక్త.. 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్‌లోకి వచ్చింది. దీని తర్వాత బింబిసార, సర్, విరూపాక్ష.. ఇలా వరస హిట్స్ అందుకుని గోల్డెన్ లెగ్ అనిపించుకుంది. అయితే 2023లో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డెవిల్' ఫ్లాప్ అయింది. గతేడాది ఓ తెలుగు మూవీలో అతిథి పాత్రలో కనిపించింది. అప్పటినుంచి ఈమె నుంచి రిలీజులు ఏం లేవు. తీరా ఇప్పుడు చూస్తే ఎనిమిది చిత్రాలు లైన్‌లో ఉన్నాయి. సంయుక్త చేస్తున్న వాటిలో బాలకృష్ణ 'అఖండ 2', పూరీ-విజయ్ సేతుపతి సినిమా, శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారీ', బెల్లంకొండ శ్రీనివాస్ 'హైందవ', నిఖిల్ 'స్వయంభు', లారెన్స్ 'బెంజ్', మహారాణి అనే హిందీ చిత్రం, తెలుగులో ఓ ఫిమేల్ సెంట్రిక్ చిత్రం ఈమె చేతిలో ప్రస్తుతం ఉన్నాయి. వీటిలో 'అఖండ 2'.. ఈ ఏడాది డిసెంబరులో రిలీజ్ కానుంది. మిగిలినవన్నీ కూడా దాదాపు వచ్చే ఏడాది, ఆపై ఏడాది థియేటర్లలోకి రానున్నాయి. సంయుక్త ప్రస్తుతం చేస్తున్న వాటిలో పూరీ-విజయ్ సేతుపతి, అఖండ 2, స్వయంభు.. పాన్ ఇండియా టార్గెట్‌గా తీస్తున్న మిగిలినవన్నీ కూడా ఆయా భాషల్లో తీస్తున్నారు. మరి వీటి వల్ల సంయుక్త కెరీర్ మళ్లీ గాడిన పడుతుందా? హీరోయిన్‌గా నిలదొక్కుకుంటుందా అనేది చూడాలి?



# స్టార్ హీరోతో రొమాన్స్ చేయాలి

విశ్వక్‌సేన్ నటించిన అశోకవనంలో అర్జున కళ్యాణం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది రితికా నాయక్. ఈ ఢిల్లీ బ్యూటీ ఆ తర్వాత నాని నటించిన హాయ్ నాన్నలో అతిథి పాత్రలో మెరిసింది. తాజాగా తేజ సజ్జా హీరోగా నటించిన ఫాంటసీ డ్రామా మిరాయి సినిమాతో మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది. ఈ చిత్రం బాక్సాపీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంటోంది. కాగా రితికా నాయక్ మిరాయి ప్రమోషన్స్‌లో తనకు సిల్వర్ స్క్రీన్‌పై ఎవరితో రొమాన్స్ చేయాలనుందో చెప్పేసింది. తాను అల్లు అర్జున్‌ను ఎంతో అభిమానిస్తానని చెప్పిన రితికా నాయక్.. నాకైతే అల్లు అర్జున్‌తో కలిసి నటించాలని ఉంది. సినిమా ఎలాంటిదైనా.. ఏ పాత్రైనా నాకు ఒకే.. అందులో నటించే అవకాశమొస్తే చాలని అంటూ తన మనసులో మాట చెప్పేసింది. ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. అప్పుడే సిల్వర్ స్క్రీన్‌పై అల్లు అర్జున్, రితికా నాయక్ కాంబోను ఊహించేసుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు. మరి రానున్న రోజుల్లో ఈ ఇద్దరి కాంబోలో సినిమా వచ్చే అవకాశం లేకపోలేదంటున్నారు సినీ జనాలు. రితికా నాయక్ మరోవైపు రెండు సినిమాల్లో నటిస్తోంది. వీటిలో తెలుగు, తమిళ బైలింగ్యువల్ ప్రాజెక్ట్ డ్యుయెట్ ఒకటి. కాగా వరుణ్ తేజ్ హీరోగా నటిస్తోన్న VT15 కూడా ఈ భామ ఖాతాలో ఉంది. ఈ రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com